www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 8 ఆగస్టు, 2023 | 12 పేజీలు



వైఎస్ఆర్



అన్నమయ్య

మున్సిపల్ కార్మికుల కలెక్టరేట్ ముట్టడి

ఉద్రిక్తం



మహిళా కార్మికులను అడ్డుకుంటున్న పోలీసులు

కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్తున్న కార్మికులు

కార్మికుడినికి అడ్డుకుంటున్న కానిస్టేబుల్

తోపులాటలో గాయపడిన కార్మికులు, సొమ్మసిల్లి పడిన కార్మికురాలు

నాయకులు, పోలీసుల మధ్య తోపులాట

మహిళా కార్మికులను నెట్టేసిన మగ పోలీసులు

నలుగురికి గాయాలు

పలువురు నాయకులు అరెస్టు.. విడుదల

మున్సిపల్ కార్మికుల కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తంగా మారింది. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్మికులు పెద్ద ఎత్తున కలెక్టరేట్‌ను ముట్టడించారు. పోలీసుల రంగ ప్రవేశం చేసి ఆందోళన కారులను చెదరగొట్టారు. ఈ సంఘటనలో కార్మికులకు రక్తగాయాలయ్యాయి. పలువురు కార్మిక సంఘ నాయకులను బలవంతంగా అరెస్టు చేశారు.

2లో



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న విసి

మూల్యాంకన కేంద్రంలో విసి తనిఖీ

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన యూనివర్సిటీ విసి ఆచార్య చింతా సుధాకర్ డిగ్రీ సమాధాన పత్రాల మూల్యాంకన కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైవీయూ లోని ప్రధాన పరిపాలన భవనంలో సోమవారం కంప్యూటర్స్, వృక్ష శాస్త్రం, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, బయోటెక్నాలజీ పేపర్లను అధ్యాపకులు మూల్యాంకనం చేస్తున్నారు. విసి సమాధాన పత్రాలను పరిశీలించారు. అసౌకర్యాలు ఏమైనా ఉన్నాయా అంటూ అధ్యాపకులు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు రాసిన సమాధానాలను క్షుణ్ణంగా చదివి మార్కులు వేయాలి తెలిపారు. ప్రతిభావంతులకు న్యాయం జరిగే విధంగా మూల్యాంకనం చేయాలని అధ్యాపకులకు ఆదేశాలు ఇచ్చారు.



దీక్షలు ప్రారంభిస్తున్న సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి

విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలని దీక్షలు

ప్రజాశక్తి - కడప అర్బన్

విఆర్ఎల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షలను వెంకటసుబ్బయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విఆర్ఎలకు పే స్కేల్ అమలు చేయాలని కోరారు. నామినేలుగా పనిచేస్తున్న వారికి విఆర్ఎలుగా పోస్టింగ్ ఇవ్వాలని పేర్కొన్నారు. అర్హులైన అటెండర్, వాచ్ మెన్, డ్రైవర్స్ ప్రమోషన్ ఇవ్వాలని చెప్పారు. సీఎం జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 23, 24న విజయవాడలో రాష్ట్రస్థాయి దీక్షలో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షులు చంద్రారెడ్డి, అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీదేవి, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి ఓబులేసు, విఆర్ఎలు పాల్గొన్నారు.

పాత్రికేయులకు ఇంటి స్థలాలివ్వాలని వినతి

కలసపాడు : మండలంలోని పాత్రికేయులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సోమవారం తహశీల్దార్ రవీంద్రారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 సంవత్సరాల నుండి పాత్రికేయ రంగంలో ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తూ ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న విలేకరులకు ప్రభుత్వానికి ఇంటి స్థలాల కోసం వినతి పత్రం అందజేశామని తెలిపారు తహశీల్దార్‌మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకే తీసుకువెళ్లే పాత్రికేయులకు కచ్చితంగా ఇంటి పట్టాలు మందులు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాత్రికేయులు రామకృష్ణారెడ్డి, ప్రసాదరావురాజు, వెంకటరెడ్డి, నారాయణరెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, అమర్నాథరెడ్డి పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు

కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం



మున్సిపల్ కార్మిక సంఘం నాయకుడిని లాగేస్తున్న పోలీసు



మున్సిపల్ కార్మికుడిని లాకెళ్తున్న పోలీసులు

ప్రజాశక్తి - కడప అర్బన్

మున్సిపల్ కార్మికులు తమ న్యాయమై డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిర్వహించిన కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తతకు దారిసింది. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. అధికారులు తమ సమస్యలు పరిష్కరించాలని ముట్టడి కార్యక్రమం చేపట్టారు. మూడు గంటల పాటు నిర్వహించిన కార్యక్రమానికి అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో నాయకులు, కార్మికులు ఆగ్రహించి కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ దొరికిన వారిని దొరికినట్లు ఈడ్చుకువెళ్లే ప్రయత్నం చేశారు. పోలీసులు..నాయకుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. ఈనేపథ్యంలో నలుగురు గాయపడ్డారు. వారిలో ఇద్దరికి రక్తగాయాలు అయ్యాయి. మరో మహిళా కార్మికురాలు సృహ తప్పిపడిపోయింది. చాలా మందికి చొక్కాలు చిరిగి పోయాయి. ఫెడరేషన్ నగర అధ్యక్షులు సుంకర రవి భుజానికి గాయమైంది. ఆయనను రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. రక్తగాయాలైన వారు ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారు. పోలీసులు నాయకులు, కార్మికులను అరెస్టు చేయడంతో ఆగ్రహించిన మహిళా కార్మికులు పోలీసుల వాహనానికి అడ్డుగా నిలిచారు. మగపోలీసులు మహిళా కార్మికులను నెట్టివేశారు. ఫలితంగా మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మగ పోలీసులతో మహిళా కార్మికులను నెట్టివేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అధికారులు వచ్చి హామీ ఇస్తే వెళ్లిపోతామని నాయకులు పోలీసులకు స్పష్టంగా తెలియజేశారు. వారు పట్టించుకోక పోవడంతో విధిలేని పరిస్థితిలో కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు నాయకులు, కార్మికులు ప్రయత్నించారు. అక్కడ ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. అరెస్టు అయినవారిని వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. కొంత మందిని విడుదల చేశారు. మరికొంతమంది విడుదలపై సందిగ్ధం నెలకుంది.

హామీలు అమలు చేయమంటే అరెస్టులా?

- ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు మనోహర్

మున్సిపల్ కార్మికులకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడిగితే పోలీసులతో అరెస్టు చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు మనోహర్ అన్నారు. ముట్టడి కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరావన్నారు. సమాన పనికి సమావేశం సుప్రీం కోర్టు తీర్పును అనుసరించాలని పేర్కొన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్, సెమిస్కిల్డ్ జీతాలు ఇవ్వాలని చెప్పారు. పనిముట్లు అందించాలని కోరారు. న్యాయమైన డిమాండ్లు సాధించేందుకు సాధించుకునేందుకు అనేక పోరాటాలు చేశామని తెలిపారు. జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. క్లాప్ డ్రైవర్లకు సకాలంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించేవరకు ఆందోళనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. అనంతరం ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు నాగేంద్ర, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కంచుపాటి తిరుపాల్, విజయభాస్కర్, కోశాధికారి గోపి, సిఐటియు నగర అధ్యక్షులు చంద్రారెడ్డి, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీదేవి, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి.ఎం.ఓబులేసు, మద్దతుగా వచ్చిన కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు విష్ణుప్రీతం రెడ్డి ప్రసంగించారు. కార్యక్రమంలో నాయకులు, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

అరెస్టులను ఖండిస్తున్నాం : డివైఎఫ్ఐ

రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద ధర్నా లో భాగంగా కడప కలెక్టరేట్ వద్ద శాంతియుత ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులను అక్రమ అరెస్టులను భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్యగా తీవ్రంగా ఖండిస్తున్నామని జిల్లా అధ్యక్షకార్యదర్శులు ముడియం చిన్ని, వీరణాల శివకుమార్ తెలిపారు. సోమవారం జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వం రాగానే పర్మనెంట్ చేస్తామని పాదయాత్రలు ఊరూరా తిరిగి హామీ ఇచ్చారని ఇప్పుడు పట్టించుకోవడం లేదని వాపోయారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, న్యాయమైన కోరిక అడగడం తప్పా అని ప్రశ్నించారు. తమ సమస్యలను పరిష్కరించాలని కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వారిని అక్రమంగా అరెస్టు చేయడం దారుణమన్నారు. సమావేశంలో నగర అధ్యక్షులు షాకీర్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్



అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

మున్సిపాలిటీలలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం పర్మినెంట్ చేయాలని సిఐటియు జిల్లాప్రధాన కార్యదర్శి ఎ. రామాంజులు పేర్కొన్నారు. సోమ వారం ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ ఎదుట జిల్లాలోని రాయచోటి, రాజంపేట మున్సిపాలిటీలలో పనిచేస్తున్న మున్సిపల్ వర్కర్స్ రెగ్యులర్ చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పర్మినెంట్ చేస్తానని ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చిన తర్వాత ఆప్కాస్‌లో చేర్పి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. సుప్రీం తీర్పు ప్రకారం పనికి తగ్గ వేతనం ఇవ్వాలని, కనీసంగా రూ. 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొబ్బరినూనె చెప్పులు, మాస్కులు, గ్లౌజులు ఇవ్వాలన్నారు. ప్రమాద బీమా సౌకర్యంతో పాటు రిటైర్డ్ మెంట్ బెనిఫిట్ సౌకర్యం కల్పించాలని చనిపోయిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని పేర్కొన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్, సెమీ స్కిల్, అన్ స్కిల్ కింద వేతనాలు చెల్లించాలన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ప్రసాద్ లక్ష్మీదేవి, మధు, శిద్దమల్లు జి.వి రమణ, తిరుపతమ్మ, రమేష్, కార్మికులు పాల్గొన్నారు.

కృపావతికి భూ విజ్ఞాన శాస్త్రంలో వైవీయూ డాక్టరేట్

ప్రజాశక్తి - కడప అర్బన్



యోగి వేమన విశ్వ విద్యాలయం భూ విజ్ఞాన శాస్త్ర విభాగ పరిశోధకురాలు చింత ల కృపావతికి విశ్వ విద్యాలయం డాక్టరేట్ ను ప్రకటించింది. భూ విజ్ఞాన శాస్త్ర శాఖ సహ ఆచార్యులు డాక్టర్ ఎస్. శ్రీనివాస్ గౌడ్ పర్యవేక్షణలో 'మొగమురేరు నది పరివాహక ప్రాంత పరిశోధనాత్మక విశ్లేషణ రిమోట్ సెన్సింగ్ అండ్ జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టం సాంకేతికతో కడప జిల్లా, ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై చింతల కృపావతి విస్తృత పరిశోధనలు చేసి రూపొందించిన గ్రంథాన్ని విశ్వవిద్యాలయ పరీక్షల విభాగానికి సమర్పించారు. వైవీయూ ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్ మార్గదర్శకం మేరకు నియమితులైన నిపుణుల బృందం, పరిశోధకురాలు కృపావతి రూపొందించిన పరిశోధన గ్రంథం అధ్యయనం చేసి డాక్టరేట్ అర్హత ఉందంటూ ధ్రువీకరించారు. భూ విజ్ఞాన శాస్త్ర విభాగంలో డాక్టరేట్ అందుకున్న కృపావతిని సి ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ ఎస్. రఘునాథ్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ టి. శ్రీనివాస్, భూ విజ్ఞాన శాస్త్ర ఆచార్యులు, అధ్యాపకులు, స్కాలర్స్, విద్యార్థులు అభినందించారు.

గణిత అధ్యాపకుడికి డాక్టరేట్

ప్రజాశక్తి- కడప అర్బన్



నగర శివారులోని కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో హ్యుమానిటీస్ అండ్ సైన్సెస్ (గణిత) విభాగంలో సహాయ ఆచార్యులుగా పని చేస్తున్న వై. సతీష్ కుమార్ రెడ్డికి రాయలసీమ విశ్వవిద్యాలయం (కర్నూలు) వారు పిహెచ్‌డి డిగ్రీని ప్రదానం చేశారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.ఎస్.ఎస్. మూర్తి తెలిపారు. సతీష్ కుమార్ రెడ్డికి కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో రిటైర్ అయినా విశ్రాంతి ఆచార్యులుగా పనిచేస్తున్న డాక్టర్ బి. రామ్ భూపాల్‌రెడ్డి పర్యవేక్షణలో పరిశోధన రాయలసీమ విశ్వవిద్యాలయం ,(కర్నూలు) పట్టాను ప్రదానం చేశారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలు సెమినార్స్, వర్క్ షాప్స్, కాన్ఫరెన్స్‌లలో పరిశోధన పత్రాలను సమర్పించారు. పిహెచ్‌డి డిగ్రీ పట్టాను పొందడం పట్ల కరస్పాండెంట్, సెక్రటరీ కందుల రాజేశ్వరమ్మ, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ శ్రీ పి ప్రేమ్ కుమార్ , హ్యుమానిటీస్, సైన్సెస్ విభాగాధిపతులు డాక్టర్ ఐ. శ్రీవాణి, సహచర కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పిహెచ్‌డి పొందిన వారిని అభినందించారు.

రైతులకు ప్రోత్సాహకం

ప్రజాశక్తి-చెన్నూరు

రైతులు సంఘంగా ఏర్పడి ఉత్పత్తుల సేకరణ కేంద్రం, శీతల గదిని ఏర్పాటు చేసుకుని వ్యాపారాభివృద్ధి చేసుకోవాలని ఉద్యానవన సంచాలకులు ఎస్ఎస్‌వి సుభాషిణి పేర్కొన్నారు. మండలంలోని ఉప్పరపల్లెలో జగన్‌మోహన్‌రెడ్డి అనే రైతుకు చెందిన ఉద్యాన పంటలను సోమవారం ఆమె పరిశీలించారు. చీనీ, నిమ్మ, జామ, అంజూర, సీతాఫలం, కొబ్బరి, మునగ, నేరేడు మూడు అంచలపద్దతిలో సాగు చేస్తున్నారని తెలిపారు. రైతులు శాశ్వత పందిరి ఏర్పాటు చేసుకుని తీగ జాతి కూరగాయలు ఏడాది పొడవునా సాగు చేసుకోవాలన్నారు. అలాగే తేనెటీగల పెట్టెలను పెట్టుకోవాలని ఉద్యానశాఖాధికారి జ్యోతిర్మయి సూచించారు. కార్యక్రమంలో ఎఇఒ పాల్గొన్నారు.

టిటిడి చైర్మన్‌కు సన్మానం

ప్రజాశక్తి-పుల్లంపేట

టిడిపి చైర్మన్‌గా ఎన్నికైన తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డిని తిరుపతిలోని ఆయన నివాసంలో పుల్లంపేట మండల అధ్యక్షుడు ముద్దా బాబుల్‌రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ టిడిడిలో నూతన సంస్కరణలకు నాంది పలకాలని తెలిపారు. సామాన్య భక్తులకు తిరుమల వెంకటేశ్వర స్వామి దర్శనానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వా లని కోరారు. కార్యక్రమంలో సుదర్శన్ రెడ్డి, రంగారెడ్డి పాల్గొన్నారు.


విరాళం అందిస్తున్న ఎంపిపి

ఆలయ అభివృద్ధికి ఎంపీ విరాళం

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని సంఘం వాండ్లపల్లి గ్రామం నీలవాండ్ల పల్లెలో నూతనంగా నిర్మిస్తున్నటువంటి శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి ఆలయ నిర్మాణానికి ఎంపీ మిథున్‌రెడ్డి సహకారంతో సోమవారం ఎంపిపి రాజేంద్రరెడ్డి చేతుల మీదుగా రూ.లక్ష నీలావాండ్లపల్లి గ్రామస్తులకు అందించినట్లు గ్రామస్తులు తెలిపారు. లక్ష రూపాయలు విరాళం మీ ముఖంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంగం వాండ్లపల్లి సర్పంచ్ నరసింహులు , పెద్దవీడు సర్పంచి నాగిరెడ్డి, పెద్దవీడు సింగల్ విండో ప్రెసిడెంట్ అమర్నాథ్ రెడ్డి, ఎంపిటిసి ఆంజనేయులు, ఆదినారాయణ, రామచంద్ర, జోకా వెంకటేష్, జోకా నాగార్జున, టేకూరి శివ, జోకా సురేంద్ర, గాలి నాగయ్య, మోడెమ్ రాజేంద్రప్రసాద్, భోజనపు తులసి, రామచంద్ర, జోకా లక్ష్మన్న, బొమ్మల వెంకట రమణ, బాబు, పెంచలయ్య, నరసింహులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీలోని అరవపల్లె గ్రామం తోటపాలెంనకు తాగు నీటిని అందించే పైపు మరమ్మతులకు గురి కావడంతో ఫిట్టర్ సుబ్బయ్య ఆధ్వర్యంలో యుద్ధ ప్రాతిపదికన తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. పైపునకు లీకేజ్ ఏర్పడడంతో, ప్రజలు సర్పంచ్ జంబు సూర్యనారాయణకు సమస్యను తెలిపారు. వెంటనే స్పందించిన ఆయన సిబ్బందికి సమ స్యను వివరించి, మరమ్మతులు చేయించి సోమవారం మధ్యాహ్నానికి తాగునీటి సరఫరాను ప్రజలకు అందించారు.


మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

పంటకోత ప్రయోగాలపై శిక్షణ

వాల్మీకిపురం : రైతు భరోసా కేంద్రం పరిధిలో నిర్వహించే పంటకోత ప్రయోగాలపై సోమవారం స్థానిక ఆర్‌బికె కేంద్రంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారి హేమలత మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంటకోత ప్రయోగాలు ఎలా చేయాలి..? యాప్‌లో ఎలా అప్‌లోడ్ చేయాలనే అంశాలపై ఆర్‌బికే ఇన్‌ఛార్జ్‌లకు వివరించారు. కార్యక్రమంలో ఎఎస్ఒ శ్రీదుర్గ, ఎఇఒ నాగరాజ, ఆర్‌బికే పాల్గొన్నారు.

జనం బాగుండాలంటే జగన్‌ను సాగనంపాలి : ఆర్ఆర్

ప్రజాశక్తి-గాలివీడు


మహిళతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి

జనం బాగుండాలంటే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని సాగనంపాలని, రాష్ట్రంలో అరాచక పాలన అందిస్తున్న వైసిపి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని నియో జకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం అరవీడు పంచాయతీలో రాష్ట్ర భవిష్యత్తుకు చంద్రబాబు గ్యారెంటీ , ఇదేంఖర్మ రాష్ట్రానికి కార యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికలలో ఒక ఛాన్స్ అంటూ ప్రజలకు మాయ మాటలు చెప్పి జగన్ అధికారంలోకి వచ్చారని అన్నారు. నాలుగేళ్ల వైసిపి అరాచక పాలన ప్రజలకు అర్థమైపోందన్నారు. రాష్ట్రం మొత్తం సైకో పాలన సాగుతోందని, ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై కేసులు పెట్టి చిత్రహింసలకు గురి చేస్తున్నారని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం ప్రజలకు చేసింది శూన్యమని తెలిపారు. ఈ ప్రభుత్వంలోఅన్ని వర్గాల ప్రజలు అన్యాయానికి గురయ్యారని టిడిపి హయాంలోని ప్రజలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తుందని పేర్కొన్నారు. గత టిడిపి హయాంలో రైతాంగానికి వారి సంక్షేమానికి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను చేపట్టి ఒదన్నారు. తిరిగి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కుటుం బంలోని విద్యార్థులందరికీ రూ.15 వేలు అందిం చడంతోపాటు, జిల్లా పరి ధిలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 18 సంవత్సరాలు నిండిన మహిళలకు నెలకు రూ.1500లు సంవత్స రానికి మూడు వంట సిలిండర్లు, రైతాంగానికి సంవత్స రానికి రూ.20వేలు, యువతకు నిరుద్యోగ భృతి అందిం చడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల దృష్టికి తీసుకు వెళ్లారు. కార్యక్రమంలో నాయకులు మంద పాటి రవీంద్రబాబు, మాజీ ఎంపిపి వెంకటనారాయణరెడ్డి ,ఈశ్వర్ రెడ్డి, మాజీ మార్కెట్ వైస్ ఛైర్మన్ లక్షుమయ్య, మాజీ ఎంపిటిసి రమేష్ బాబు, సింగల్ విండో మాజీ ప్రెసిడెంట్ భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నాగయ్య , టిఎస్ మహబూబ్ బాషా గూడు సాహెబ్, సురేష్ తెలుగు జక్రియ, సుబ్బయ్య, సురేంద్రరెడ్డి పాల్గొన్నారు. **నందలూరు:** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు తోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్తు సాధ్యమవుతుందని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జంగంశెట్టి సుబ్బయ్య, బిసి సెల్ కార్య నిర్వాహక కార్యదర్శి చుక్క యానాదిలు పేర్కొన్నారు. చింతకాయలపల్లిలో టిడిపి నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జంగంశెట్టి సుబ్బయ్య, బిసి సెల్ కార్య నిర్వాహక కార్యదర్శి చుక్క యానాది మాట్లాడుతూ గడిచిన నాలుగేళ్ల పాలనలో వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు బోనబోయిన నరసయ్య మండల ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి సుబ్బరాయుడు, నాయకులు జ్యోతి శివ, కొండయ్య , ప్రసాద్, రమణయ్య, నరసయ్య, శ్రీనివాసులు ,రాము యాదవ్, రామయ్య, తిరుపలయ్య, సుధాకర్, చంద్ర, భాస్కర్, శేఖర్, నాగేశ్వర్ నాయుడు, హరి ,కృష్ణయ్య, వెంకటసుబ్బయ్య, నాగూర్ వెంకటయ్య, నాగి వెంకటసుబ్బయ్య, నాగి వెంకటరమణ, జి శివ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

ప్రజాశక్తి- రాయచోటి



పీలేరు : ర్యాలీ నిర్వహిస్తున్నచేనేత కార్మికులు

జాతీయ చేనేత దినోత్సవ సంద ర్భంగా రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో చేనేత కళాకారులు ర్యాలీని ఘనంగా నిర్వహించారు .ర్యాలీగా (బంగ్లా) జూనియర్ కళాశాల నుంచి ఎన్‌జిఒ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎన్‌జిఒ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. చేనేత కళాకాల ఉద్దేశించి వైఎస్ఆర్ జిల్లా అధికార ప్రతినిధి శిబ్యాల విజయభాస్కర్ మాట్లాడుతూ స్వతంత్రం వచ్చి ఇప్పటికీ 75 ఏళ్లయినా, ఎన్నో ప్రభుత్వాలు మారినా ఏ ఒక్కటికీ చేనేతను పట్టించుకున్న పాపాన పోలేదని, ఒక్క జగన్మోహన్ రెడ్డి మాత్రమే చేనేతలను గుర్తించారు అన్నారు. చేనేతలకు ఏడాదికి రూ. 24 వారి అకౌంట్లో వేస్తున్నారు అన్నారు. జిల్లాలోనే 2023వ సంవత్సరం గాను 6937 లబ్ధిదారులకు రూ.16 .64 కోట్లు డైరెక్టుగా లబ్ధిదారుల ఖాతాలోనే జమ చేశారు అన్నారు. రెండు ఎకరాల లోపు ఉన్న ప్రతి చేనేతకూ నేతన్న నేస్తం వచ్చేల చూడాలని ప్రభుత్వానికి కోరారు. .అనంతరం ఏడి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న నేతన్న నేస్తాన్ని చేనేత కార్మికులు సద్వినియం చేసుకోవాలన్నారు. అనంతరం ఇద్దరు చేనేతలను సన్మానించారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి జడ్‌పిటిసి రెడ్డయ్య, రాష్ట తొగటవీర క్షత్రియ సేవ సంఘం ప్రధాన కార్యదర్శి బామిషెట్టి కృష్ణమూర్తి, మదనపల్లి కౌన్సిలర్స్ మందపల్లి వెంకటరమణ, రమణ, శివయ్య, శీలం రమేష్, జిల్లా బిసి సేల్ అధ్యక్షుడు మోడెమ్ నాగభూషణం, ప్రధాన కార్యదర్శి సంజీవ, చేనేత నాయకులు నాగరాజ, గుండ్లపల్లి వెంకటేష్, చిటేం రామచంద్ర, మాజీ సర్పంచ్ హరినాథ్, మందపల్లి వెంకట రమణ, పులాశెట్టి ఓబులేసు, నాగరాజ, జగదీష్, అను ంపల్లి రామచంద్ర, దప్పేపల్లి శీనువాసులు , మోడెమ్ నాగరాజ, పురం శ్రీరాములు, జొక సురేంద్ర, మోడెమ్ రమేష్,కాదిరి హరిప్రసాద్, భువనేశ్వర్, శివభాస్కర్ పాల్గొన్నారు.**పీలేరు :** చేనేత కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని జాతీయ చేనేత ఐక్యవేదిక అధికార ప్రతినిధి పోలిశెట్టి సురేంద్ర తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సోమవారం ఐక్య వేదిక రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పీలేరు పట్టణంలో చేనేత కార్మికులు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక తాలూకా కార్యాలయానికి చేరుకుని తహశీల్దారు ధనుంజయులుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అర్హులైన చేనేత కార్మికులందరికీ మూడు సెంట్ల వంతున ఇంటి స్థలాలను కేటాయించాలని, 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాలని, చేనేత పై ఉన్న జిఎస్‌టిని రద్దుకు ప్రభుత్వం చర్యలు తీసుకునేలా ప్రభుత్వానికి తమ తరపున సిఫార్సు చేయాలని తహశీల్దారును కోరారు. కార్యక్రమంలో జాతీయ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు సుంకర చిన్నరెడ్డి బాబు, నాయకులు ఎస్.వెంకటరమణ, ఎం. సతీష్, కె.ఎల్లప్ప, ఎం.మోహన్, పి.కృష్ణయ్య, జి.నాగేశ్వర, పి. చంద్రయ్య, పి.రామకృష్ణమూర్తి, జి.నాగరాజ, మహిళా చేనేత కార్మికులు పాల్గొన్నారు.**తంబళ్లపల్లి:** మండలంలోని మూడు పాఠశాలల్లో 70 మంది విద్యార్థులకు చేనేత కార్మికులు విద్యా సామగ్రి పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో శ్రీనివాసకాలనీ పాఠశాల ఉపాధ్యా యురాలు సుజాత, కురవపల్లి పాఠశాల ఉపాధ్యా యురాలు నిర్మల, దాదంవడ్డిపల్లి పాఠశాల ఉపాధ్యా యురాలు మెహరూన్, చేనేత కార్మిక సంఘం నాయకులు రేపన మల్లికార్జున,తేపల్లి నరసింహులు, గుడే శంకర, శశికుమార్, కార్మికులు వెంకట రమణ, రమేష్‌లు పాల్గొన్నారు.**నిమ్మనపల్లె :** చేనేత వస్త్రాలను ప్రతి ఒక్కరూ ఆదరించాలని ఎంఈఓ ఎం.ఆర్ పద్మావతి అన్నారు. మండల పరిధిలోని తవళం ప్రాథమికోన్నత పాఠశాలలో జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ చేనేత వస్త్రాలు భారతీయ వారసత్వ సంపదని, వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించాలన్నారు.చేనేత రంగాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మీనానాగలక్ష్మి, కృపానందం, హరి ప్రసాద్, మధు, శ్రీలత, ఆనంద్ పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న డిఎఫ్ఒ వివేక్

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

- ఇద్దరు కూలీలు అరెస్టు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రోల మడుగు అటవీ ప్రాంతంలో అక్రమంగా ఎర్రచందనం తరలిస్తున్న ఇద్దరు కూలీలను అరెస్టు చేసి 40 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా అటవీశాఖ అధికారి వివేక్ తెలిపారు. అటవీ శాఖ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగల విలువ బహిరంగ మార్కెట్లో సుమారు రూ.20 లక్షలు ఉంటుందని తెలిపారు. ఎవరైనా ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడిపై పెట్రోలు పోసి నిప్పు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్


చికిత్స పొందుతున్న యువకుడు

యువకుడిపై గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి తగులబెట్టిన సంఘటన పట్టణ రూరల్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..రూరల్ పరిధిలోని డ్రైవర్స్ కాలనీకి చెందిన అల్తాఫ్(18) సోమవారం ఉదయం రోడ్డుపై నడుచు కుంటూ వెళుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనం పై వచ్చి పెట్రోల్ పోసి తగులపెట్టి హత్యాయత్నానికి పాల్పడ్డారు. తీవ్రంగా గాయపడిన బాధితుడిని స్థానికులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న డిఎస్‌పి కేశప్ప, సిఐ మురళీకృష్ణలు ఆసుపత్రికి చేరుకుని బాధితుడిని పరామ ర్శించి ఘటనపై ఆరా తీశారు.ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తు న్నట్లు తాలూకా పోలీసులు తెలిపారు.

మహిళా లెక్చరర్ హత్య కేసులో కీలక మలుపు

నలుగురు నిందితులు అరెస్టు

హత్యకు సహకరించిన భర్త

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రవేట్ కళాశాల మహిళా లెక్చలర్ రుక్సానా (32) హత్య కేసు కీలక మలుపు తిరిగింది. ఆమె హత్యకు భర్త ఖదీర్ అహమ్మద్ సహకరించినట్లు పోలీసులు విచారణలో తెలింది. ఈ హత్య కేసులో మరో నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు డిఎస్‌పి కేశప్ప తెలిపారు. సోమవారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్‌పి మాట్లాడుతూ మదనపల్లి పట్టణంలోని శివాజీ నగర్‌కు చెందిన రుక్సానా హత్య కేసులో భర్త ఖదీర్‌అహమ్మద్, బావజాన్ కుమారుడు ఎస్.ఆయాజ్‌అహమ్మద్, లేట్ బాషాసాహెబ్ కుమారుడు షేక్ జాఫర్‌బాషా, షేక్‌అలీఉల్లా కుమారుడు దాదపీర్‌లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరు రుక్సానాను హత్య చేయడానికి బయట నుంచి సహాయం చేసినట్లు తెలిపారు. కుటుంబ కలహాల నేపథ్యంలోనే మహిళను హత్య చేయడానికి ప్రోత్సహించారని తెలిపారు. ఈ హత్య కేసులో ఇప్పటి కి మొత్తం ఏడుగురు నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరిపై రౌడీ షీట్ ఓపెన్ చేశామని తెలిపారు. సమావేశంలో టూ టౌన్ సిఐ మురళీ కృష్ణ పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి కేశప్ప



విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానిస్తున్న ఎంఇఒలు

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని ఎంఇఒలు ఎం.ఆర్ పద్మావతి, నారాయణ, రాజగోపాల్ అన్నారు. సోమవారం ముష్టూరులో కస్తూరిబాగాంధీ విద్యాలయంలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా ప్రతిభ అవార్డు అందుకున్న విద్యార్థిని సబియా కు జిల్లా స్థాయిలో సైతం ప్రథమ స్థానంలో నిలిచినందుకు, జిల్లా విద్యా శాఖ కార్యాలయం నుంచి గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ అధికారి ద్వారా మంజూరైన రూ.50 వేలు ప్రతిభ సాయం, ప్రశంసా పత్రం, షీల్డ్, అందజేశారు. విద్యార్థిని తల్లిదండ్రులు నజీర్ అహ్మద్, షకీల దంపతులకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను చూసి మిగతా విద్యార్థులందరూ స్ఫూర్తి పొందాలన్నారు. విద్యార్థిని సబియా తల్లిదండ్రులను ప్రశంసించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్ఛార్జి స్పెషల్ ఆఫీసర్ జరీనా బేగం, సి ఆర్ పి సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లలకు వ్యాధి నిరోధక టీకా తప్పనిసరి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

ఐదేళ్లు పూర్తయిన ప్రతి బిడ్డకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని ఎంఎల్హెచ్సి చంద్రశేఖర్ పేర్కొన్నారు. వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్ దప్పేపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాల పిల్లలకు ఆ గ్రామ సర్పంచ్ కేశవ చేతుల మీదుగా వ్యాక్సిన్ వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే అంగన్వాడీ కేంద్రంలో పేరు నమోదు చేసుకోవాలని ప్రతినెల బిడ్డ ఎదుగుదల గురించి పరీక్షలు నిర్వహించాలన్నారు. టీకా సూదులు ఐదు సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకరయ్య, అంగనవాడీ కార్యకర్త, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

వైసిపి ప్రభుత్వంలో గత నాలుగు సంవత్సరాలుగా గడప గడపకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే నవాజ్ బాషాఅన్నారు. సోమవారం వెంగంవారిపల్లి పంచాయితీలోని బాలినాయన పల్లి, బాలినాయన పల్లి హరిజన వాడ తదితర గ్రామాల్లో సర్పంచు శ్రీవాణి నవీన్, మండల కో-ఆప్షన్ సభ్యులు మహమ్మద్రఫీ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం జరిగింది. ఎంపిపి నరసిం హులు, సింగిల్ విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్రెడ్డి, మండల ఇన్చార్జి ఆర్.ఐ రమణారెడ్డి, నవీన్లతో కలిసి ఎమ్మెల్యే గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి లబ్ధిదారులను పలకరించారు. ప్రభుత్వం గత నాలుగేళ్లుగా అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించే బుక్ లెట్ ను లబ్ధిదారులకు అందించి, సంక్షేమ పథకాల ద్వారా పొందిన సాయాన్ని వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఏమైనా ఉంటే చెప్పాలంటూ ఎమ్మెల్యే స్థానికులను అడిగారు. గ్రామాల్లో అవసరమైన సిమెంట్ రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణం, త్రాగునీటి కొళాయిలు ఏర్పాటు, పింఛన్లు, రేషన్ కార్డుల మంజూరు, రెవిన్యూ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి ప్రజలు తెచ్చారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు అక్కడికక్కడే ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు. బాలినాయనపల్లిలో ఇటీవల చాకలి రఘు ఆక్రమించిన ప్రభుత్వ భూమిని అధికారులు స్వాధీనపరుచుకోగా, గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఆ స్థలాన్ని సందర్శించి గ్రామస్తుల వినతి మేరకు ఆ స్థలంలో బస్ షెల్టర్ నిర్మాణ పనులను మరో రెండు రోజుల్లో ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు సుబ్రమణ్యం, మండల కో-ఆప్షన్ సభ్యులు మహమ్మద్ రఫీ, నాయకులు నవీన్, యుగంధర్ రెడ్డి, శశిధర్ రెడ్డి, దూకుడు వెంకటరమణ, శ్రీనివాసులు శెట్టి, డవ్ నాగరాజా, ఏఈలు హరినాద్ రెడ్డి, వసంత రెడ్డి, అమర్నాథ్, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణారెడ్డి, విఆర్ఒ వసంత కుమారి, వైసిపి కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై కఠిన చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-కలికిరి

అక్రమ కట్టడాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గిరీష వెల్లడించారు. సోమవారం స్థానిక మండలంలోని సిఎల్ఆర్సి భవనం వెనక ఉన్నటువంటి జగనన్న కాలనీ లో జరుగుతున్నటువంటి అవకతవకుల, రహదారి సమస్యలపై కలెక్టర్ విచారణ నిమిత్తమైకలికిరిలో పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న కాలనీలో వసతులపై ఆరాతీశారు. విద్యుత్, నీటి సమస్యలు, డ్రైనేజీ మరమ్మతులపై సంబంధిత అధికారులతో చర్చించి సమస్యల పరిష్కరించాలని ఆ శాఖ అధికారులకు ఆదేశించారు. రహదారి విషయమై కాలనీ వాసులు కోరగా సత్వరం దారి సమస్య పరిష్కరించి కాలనీ నివాసులకు వసతి కల్పించాలని తాసిల్దార్ భాగ్యలతను ఆదేశించారు. అనంతరం జగనన్న కాలనీకి సంబంధించి నటువంటి నివాసాలలో పర్యటించి వసతులపై ఆరా తీసి జగనన్న గృహాలను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ భూముల్లో అనుమతి లేకుండా కట్టినటువంటి భవనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని అవసరమైతే కేసుల నమోదు చేసి భవనాలను కూల్చాలని తహశీల్దార్కు సూచించారు. అనంతరం కలికిరి సచివాలయం-3 కు సంబంధించిన జగనన్న కాలనీను పరిశీలించారు. ఆ కాలనీకి సంబంధించినటువంటి సమస్యలను సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ భాగ్యలత, ఎంపిడిఒ గంగయ్య, జడ్పిటిసి పద్మజ లోకవర్ధన్, ఎంపీపీ వేంపల్లి నూర్జహాన్, విద్యుత్ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



జగనన్న కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ గిరీష

ఆరోగ్యశ్రీ పథక సాధకుడు మందకృష్ణ

ప్రజాశక్తి-పీలేరు

ఆరోగ్యశ్రీ పథకం సాధకుడు మందకృష్ణ మాదిగని ఎంఆర్పిఎస్ జిల్లా ఇన్ఛార్జ్ కెఎన్.రాజు మాదిగ తెలిపారు. సోమవారం ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా సంబరాలు జరుపుకుంటున్నారు. పీలేరులో ఎంఆర్పిఎస్ సీనియర్ నాయకులు గండికోట వెంకటేష్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాసుపత్రికి నెబులైజర్ను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్కు అందించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్ఛార్జి మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ స్ఫూర్తిదాత మందకృష్ణ మాదిగ గుండె జబ్బు పిల్లలపై రాష్ట్ర వ్యాప్తంగా అనేక ఉద్యమాలు చేసి హైదరాబాదులో పెద్ద ఉద్యమం నడపడంతోనే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్య మంత్రి వైయస్ రాజశేఖర్రెడ్డి పేద పిల్లల గుండె జబ్బులు ఆపరేషన్ కొరకే కాకుండా అనేక రకాల జబ్బులతో బాధపడుతున్న పేదల అందరికీ రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం తెచ్చి అసెంబ్లీలో తీర్మానించారని అన్నారు. కార్యక్ర మంలో డాక్టర్ శివయ్య, హెడ్ నర్స్ రాజ్యలక్ష్మి, ఆరోగ్యశ్రీ సిబ్బంది ఉమా మహేశ్వరి, మాల మహానాడు తుమ్మల ధరణి కుమార్, పీలేరు నియోజకవర్గం ఎంఆర్పిఎస ఇంచార్జ్ గండికోట వెంకటేష్, పీలేరు నియోజ కవర్గం ఇంచార్జ్ ఎర్రయ్య, ముల్లంగి గురవయ్య, వంగళ్ల శ్రీనివాసులు, బేతపూరి వెంకటరమణ, గండికోట హుస్సేనయ్య, అధ్యక్షులు విశ్వనాథ పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** ఎంఆర్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పోరాట ఫలితమే ఆరోగ్య శ్రీ పథకం సిద్ధించిందని ఎం.ఎస్.పి తంబళ్లపల్లి నియో కవర్గ ఇన్ఛార్జి చిన్నా పేర్కొన్నారు, పట్టణంలోని జ్యోతి చౌక్ వద్ద బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు భవాని వెంకటేష్, మండల కన్వీనర్ చౌడప్ప,కో-కన్వీనర్ గట్టు రమణ, రామాంజి ఎమ్మార్పిఎస్ మండల కన్వీనర్ ఆర్.కె.రఘు, రాముడు, మొరవపల్లి శంకర, శ్యామ్, ముని, రాజు, ఆది, మనోహర్, కొనప్ప, వెంకటేష్ పాల్గొన్నారు.



పీలేరు : ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు నెబులైజర్‌ను అందిస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

వార్డు సభ్యుల ఎన్నికలు

తంబళ్లపల్లి: మండలంలో ఖాళీ అయిన గ్రామపంచాయతీ వార్డు సభ్యుల ఎన్నికకు ఎన్నిక కమిషన్ నోటిఫికేషన్ ఇచ్చినట్లు సోమవారం ఎంపిడిఒ సురేంద్రనాథ్ తెలిపారు. తంబళ్లపల్లె 11వ వార్డు ఎంపీ జనరల్ కు ఎద్దుల వారి పల్లె రెండొవ వార్డుకు ఎస్సీ మహిళ కోటకొండ ఏడవ వార్డుకు బిసి మహిళకు రిజర్వేషన్ కేటా ఇచ్చినట్లు తెలిపారు. మంగళవారం నుంచి గురువారంలో అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసుకోవచ్చని అన్నారు. 19వ తేదీ ఎన్నికల పోలింగ్ జరుగుతుందన్నారు.



వాల్మీకిపురం :గద్దర్‌కు నివాళి అర్పిస్తున్న ప్రజాసంఘాలు, విద్యార్థులు

గద్దర్ నేటి తరానికి ఆదర్శం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ఉద్యమనేత గద్దర్ ఉద్యమ స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శం కావాలని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు శివయ్య, రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు వెంకటస్వామి అన్నారు. సోమవారం స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ప్రజా కవి గద్దర్ ఆకస్మిక మరణం పట్ల నివాళులర్పించి, జోహార్లు పలికారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తూటాల వంటి పాటలతో సమాజంలో చైతన్యాన్ని, విప్లవాన్ని తీసుకువచ్చిన మహా ఉద్యమ నేత గద్దర్ అని, భూమి కోసం, భుక్తి కోసం, బానిసత్వం నుంచి విముక్తి కోసం ఆయన పోరాటాలు సాగించారని, సామాజిక న్యాయం కోసం పాటలతో ఉద్యమించారని పేర్కొన్నారు. ఆకస్మిక మరణంతో భౌతికంగా గద్దర్ లేకపోయినప్పటికీ పాటల రూపంలో ఆయన ప్రతి గుండెలో సజీవంగా ఉంటారని, గద్దర్ ఆశయ సాధన కోసం విద్యార్థులు, యువత , మేధావి వర్గం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హరికృష్ణ, మధుసూదన్, ప్రభాస్, అజయ్, నందమూరి బాబు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** ప్రజాయుద్ధ నౌక గద్దర్ మరణం రెండు తెలుగు రాష్ట్రాల పీడిత వర్గాల ప్రజలకు తీరని లోటని బహుజన సేన రాష్ట్ర నాయకులు కొండపల్లి ఆనంద్ అన్నారు. గద్దర్ మరణానికి బహుజన సేన ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్ నందు గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ గద్దర్ మరణం రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలను చాలా దిగ్భ్రాంతి గురిచేసిందని తెలిపారు. **పౌరహక్కుల సంగం ఆధ్వర్యంలో:** స్థానిక అంబేద్కర్ సర్కిల్ నందు పౌరహక్కుల సంగం ఆధ్వర్యంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. **పీలేరు:** ప్రజా యుద్ధనౌక గద్దర్ పార్థివ దేహానికి విసికె పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్, రాష్ట్ర నాయకులు పాలకుంట శ్రీనివాసులు నివాళులర్పించారు. హైదరాబాద్ ఎల్బీ నగర్ స్టేడియంలో ప్రజల చివరి చూపు కోసం ఉంచిన గద్దర్ పార్థివదేహాన్ని వారు దర్శించుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజా యుద్ధనౌక గద్దర్ బడుగు, బలహీన వర్గాల గొంతుక అని, బాబా సాహెబ్ అంబేద్కర్ కోరుకున్న సమాజాన్ని, ఆయన కన్న కలల సాకారానికి తన పాటలు, ఆటల ద్వారా బహుజన ప్రజలను నిద్ర లేపిన విప్లవ గొంతు ఇక లేకపోవడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వారితో పాటు మురగేషన్ ప్రభు, ముత్యాల మోహన్, మలారి గిరిబాబు, సూరి, తలారి క్రిష్ణ పాల్గొన్నారు.

కాణిపాకంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

కాణిపాకం స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని రాయచోటి శాసనసభ్యులు గడికోట శ్రీకాంత్‌రెడ్డి సోమవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఇఒ వెంకటేసు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేసారు. కార్యక్రమంలో ఆలయ ఎఇఒ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ రంగస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాబు పాల్గొన్నారు.



స్వీట్లు తినిపించుకుంటున్న నాయకులు

బిజెపి ప్రభుత్వానికి చెంపపెట్టు : కాంగ్రెస్

ప్రజాశక్తి- రాయచోటి

ఎప్పటికైనా సత్యమే గెలుస్తుంది అనడానికి రాహుల్‌గాంధీకి ఎంపీ తిరిగి పునరుద్ధరణ కావడమేనని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ఎస్ అల్లా బకస్(సిఎల్‌పి) అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలోని వాయనాడు పార్లమెంట్ నియోజకవర్గానికి ఎంపీగా ఉన్న రాహుల్ గాంధీ పరువు నష్టం కేసుతో లోక్‌సభ సభ్యత్వం కోల్పోయిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి తిరిగి సభ్యత్వం పొందటం చాలా సంతోషంగా ఉందన్నారు. పరువునష్టం కేసులో రాహుల్ గాంధీకి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ గుజరాత్ హైకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేశారు అన్నారు. అాహుల్ న్యాయపోరాటంతో సుప్రీంకోర్టు గుజరాత్ హైకోర్టు తీర్పుపై స్టే విధించింది. దీంతో రాహుల్ గాంధీ సభ్యత్వ పునరుద్ధరణకు లైన్ క్లియర్ అయిందన్నారు. 138 రోజుల తర్వాత మళ్లీ రాహుల్ గాంధీ పార్లమెంట్లలో అడుగుపెట్టి ప్రజల తరపున ఎప్పటికీ ప్రశ్నిస్తూనే ఉంటారని చెప్పారు. రాబోయే ఎన్నికలలో బిజెపి ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలపడానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు చెన్న కృష్ణ, అన్నమయ్య జిల్లా మీడియా చైర్మెన్ నరేష్, ఎన్‌యుసి ఉపాధ్యక్షుడు ఉభయతుల్లా, పట్టణ యువజన అధ్యక్షులు వసీం, అన్వర్, నయానాఖాన్, మోదిన్‌బాష, వినోద్, జెసివుల్లా పాల్గొన్నారు.

సంతృప్తి స్థాయిలో అర్జీలకు పరిష్కారం

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజల్లో సంతృప్తిస్థాయి పెంచేలా స్పందన జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారం ఉండాలని కలెక్టర్ గిరీషా పిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ గిరీషా పిఎస్, జెసి ఫర్మన్ అహ్మద్ ఖాన్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి జయరాజ్, డిఆర్ డిఏ పిడి సత్యనారాయణలు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన జగనన్నకు చెబుతాం అర్జీల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కరించాలని సూచించారు.ఎలాంటి సమస్యకైనా నిర్దేశిత గడువులోగా పరిష్కారం ఉండాలన్నారు. స్పందనలో అందిన అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించడానికే అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పూర్తిగా పరిశీలించి పారదర్శకంగా విచారణచేసి అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. ఏ అర్జీకూడా రీఓపెనింగ్‌కు ఆస్కారం లేకుండా పరిష్కరింపబడాలన్నారు. వైయస్సార్ అచీవ్మెంట్ అవార్డు లిస్టు ఈనెల 17లోగా పంపాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆర్డినెన్స్‌ను ఉపసంహరించుకోవాలి

- కలెక్టరేట్ ఎదుట ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

దళితుల, గిరిజనుల అభ్యున్నతి, ఆత్మగౌరవం, జీవనోపాధి కోసం ఇచ్చిన అసైన్డ్ భూములను ప్రభుత్వమే అమ్ముకోవచ్చని ఆర్డినెన్స్ తీసుకురావడాన్ని వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ముందు జరిగిన కార్యక్రమంలో గ్రామీణ పేదలకు భూములు పంపిణీ చేయాలని, భూ కబ్జాలను అరికట్టాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ అసైన్డ్ చట్ట సవరణపై అన్ని రాజకీయ, వ్యవసాయ కార్మిక, దళిత సంఘాలతో చర్చించిన తర్వాతనే ముందుకు వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ ఆర్డినెన్స్ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అన్యాక్రాంతమైన అసైన్డ్ భూముల వివరాలు గ్రామ సచివాలయంలో బహిరంగ పరచాలని, భూమి లేని పేదలకు పంపిణీ చేయాలన్నారు. దళితులు, ఇతర పేదలకిచ్చిన అసైన్డ్ ప్రభుత్వాలు పంపిణీ చేసిన భూములను అనేక చోట్ల భూస్వాములు, పలుకుబడి కలిగిన వారు దౌర్జన్యంగా లాక్కున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిట్వేలు మండలంలోని నగరిపాడు రెవెన్యూ గ్రామంలో గిరిజనుల అనుభవంలో ఉన్న భూములను ఫారెస్ట్ అధికారులు లాక్కున్నారని, అగ్రవర్ణాల వారు ఆక్రమించిన భూముల జోలికి వెళ్లకుండా, గిరిజనులపై బెదిరింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. పెద్దూరు, చెర్లోపల్లి గిరిజనులకు భూములను పంచాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో భూములు పెంచుతామని హెచ్చరించారు. ధర్నా అనంతరం జిల్లా కలెక్టర్ గిరీషా కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆయన చిట్వేలు తహసిల్దార్ రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు, రామాంజులు, రామచంద్ర, బసిరెడ్డి, వెంకటయ్య, వెంకటరమణ, మల్లికార్జున, అంకయ్య, మల్లీశ్వరయ్య, కృష్ణవేణి, కన్నెమ్మ, వెంకటరమణమ్మ పాల్గొన్నారు.

ఇసుక దోపిడీని అరికట్టాలి : 'బత్యాల'



సమావేశంలో మాట్లాడుతున్న బత్యాల చెంగల్రాయులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఇసుక దోపిడిని నిలువరించాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చెంగల్రాయులు డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రకృతి ప్రసాదించిన ఇసుకను విచ్చలవిడిగా తవ్వడం వలన నదులలో నీటిని ఒడిసి పట్టే ఇసుక శాతం తగ్గడం వలన తీవ్రమైన నీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉందని అన్నారు. ఇసుక తవ్వకాలు నిలిపివేయాలని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆదేశించినా రాజంపేట నియోజకవర్గంలో ఇసుక మాఫియా యథావిధిగా కొనసాగుతోందని ఆరోపించారు. ఇసుక అక్రమార్కులు బాలరాజుపల్లె పాయింట్ నుంచి బెంగుళూరు, మందరం నుంచి చెన్నై, టంగుటూరు ఇసుక రీచ్ నుంచి హైదరాబాదుకు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని తెలిపారు. అనుమతులకు మించి ఎక్కువ లోతు తీస్తున్నారన్న కారణంగా గతంలో కూడా బాలరాజుపల్లిలో నిరసన తెలిపి అడ్డుకోవడం జరిగిందని అన్నారు. జంగాలపల్లిలో 2000 మందితో ధర్నా చేయడంతో లోడు దించి ఖాళీ వాహనాలు వెనుదిరిగాయని అన్నారు. లారీ ఇసుక రూ.2.50 లక్షలు ధర పలుకుతోందన్నారు. ఇసుక మాఫియా కోట్లు ఆర్జిస్తున్నారని వివరించారు. చర్యలు చేపట్టాల్సిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కాసులకు కక్కుర్తి పడి చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని, ఇసుక దోపిడీ పట్ల జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. వారంలోపు ఇసుక తవ్వకాలు పట్ల చర్యలు చేపట్టకపోతే వచ్చే సోమవారం ఇసుక రీచ్ ల వద్ద ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, అద్దేపల్లి ప్రతాప్‌రాజు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మందా శ్రీనివాసులు, టిడిపిమండల అధ్యక్షులు గన్నే సుబ్బ నరసయ్య నాయుడు, వెంకటేశ్వర్లు నాయుడు, డి ఆర్ ఎల్ మణి, కొల్లి రెడ్డెయ్య నాయుడు, జడ శివ, తిరుపాలు పాల్గొన్నారు.

వంద శాతం టీకాలు వేయించాలి : కలెక్టర్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ గిరీష, అధికారులు

ప్రజాశక్తి - రాయచోటి

వ్యాధి నిరోధక టీకాలు వేసుకోని పిల్లలకు మిషన్ ఇంద్రధనస్సు ద్వారా వంద శాతం వేయించాలని కలెక్టర్ గిరీష డిఎంహెచ్ఓ, వైద్య సిబ్బందిని ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని స్పందన హాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో 'మిషన్ ఇంద్రధనస్సు, నులిపురుగుల వాల్‌పోస్టర్లను కలెక్టర్, జెసిలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి చిన్నారికీ వ్యాధి నిరోధక టీకాలు వేయడమే లక్ష్యంగా మిషన్ ఇంద్రధనుస్సు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం ఈ నెల 7 నుంచి 12 వరకూ నిర్వహించనున్నామని చెప్పారు. జిల్లాలో రెండేళ్లలోపు 1571 మంది చిన్నారులు, రెండు నుంచి ఐదు సంవత్సరాలలోపు 1128 మంది చిన్నారులు, గర్భిణులు 590, మొత్తం జిల్లా వ్యాప్తంగా 3289 మందికి వ్యాధి నిరోధక టీకాలు వేయాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. ఈ టీకాలు వేయించడం ద్వారా పిల్లల్లో వ్యాధి నిరోధక వ్యవస్థ పెరుగుతుందని తెలిపారు. తద్వారా శిశు మరణాలను నిరోధించవచ్చునని తెలిపారు. ఈ ఏడాది చివరి నాటికి మీజిల్స్ రుబెల్లా నిర్మూలనలో భాగంగా మిషన్ ఇంద్రధనుస్సు కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. 4.90 లక్షల ఆల్‌బెండజోల్ మాత్రలు ఈ నెల 10న నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులకు మింగించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 19 ఏళ్లలోపు ఉన్న పిల్లలకు మాత్రలు వేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. జిల్లాలో 4,00,234 మందికి వేయాలనేది లక్ష్యం కాగా, 4.90 లక్షల మాత్రలు సిద్ధం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డాక్టర్ కొండయ్య, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడి జయరాజ్, డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, డిఐఒ డాక్టర్ ఉషశ్రీ, ఆర్ బిఎస్‌కె జిల్లా పిఒ డాక్టర్ శేషగిరి బాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కలెక్టర్ గిరీషకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

ముంపు నుంచి కాపాడండి : సిపిఎం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కొత్తపల్లి ప్రాంతాన్ని ముంపునకు గురి కాకుండా కాపాడాలని, అందుకోసం అలిమాబాద్, రవిహాల్ నుంచి వచ్చే మురుగు నీటిని ఠానా వద్ద ఉన్న కాలువకు కలపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ రాయచోటి నుంచి రాజంపేట రోడ్డు వెడల్పుతో పాటు ఇరువైపులా మురుగు నీటి కాలువలు నిర్మిస్తున్నారని తెలిపారు. కొత్తపల్లి ప్రాంతం చిన్న పాటి వర్షానికే మునిగిపోయి, పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ద్విచక్ర వాహనాలు కొట్టుకొని వెళ్లిపోయాయని వివరించారు. ప్రస్తుతం అలీమాబాద్ ప్రాంతం నుంచి వచ్చే డ్రెయినేజీ కాలువలు మండిల వద్ద గల కాలువకు కలుపుతూ, రవి హాల్ వద్ద నుంచి వచ్చే మురుగు నీటిని కూడా మండీల వద్ద ఉన్న తూములకు కలుపుతూ కాలువల నిర్మాణం జరుగుతోందని, దీనివల్ల పట్టణంలోని మొత్తం డ్రెయినేజీ, వర్షపు నీరు ఒకే కాలువకు చేరి, లోతట్టు ప్రాంతమైన కొత్తపల్లి ప్రాంతంలోని ఇండ్లల్లోకి నీరు చేరుతోందని చెప్పారు. అయితే రవి హాల్ నుండి వచ్చే డ్రెయినేజీ కాలువను ఠానా వద్ద గల డ్రైనేజ్ కాలువకు కలపడం ద్వారా కొత్తపల్లి ప్రాంత ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయవచ్చని సూచించారు. కలెక్టర్ స్పందించి తగు నివేదిక ఇవ్వాలని రాయచోటి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు డి.సి.వెంకటయ్య, కొత్తపల్లి వాసులు యూసుఫ్, నుసురుల్లాబాషా, బషీర్ పాల్గొన్నారు.

సిఐ లింగప్ప సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రూరల్ సిఐ లింగప్ప సేవలు మరువలేనివని అన్నమయ్య జిల్లా మైనార్టీ అధ్యక్షులు బెపారి మహమ్మద్‌ఖాన్ అన్నారు. బదిలీపై వెళ్తున్న లింగప్పను సోమవారం వారి కార్యాలయంలో కలిసి వారిని గౌరవప్రదంగా సన్మానించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాయచోటి రూరల్ సిఐ మూడేళ్ల కాలంలో శాంతి భద్రతలను పరిరక్షిస్తూ ఉత్తమమైన సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో సరదాగా కాసేపు రెస్టారెంట్ యజమాని దివాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రూరల్ సిఐగా తులసీరామ్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్



సిఐ తులసీరామ్

రూరల్‌సిఐగా కొనసాగుతున్న లింగప్ప ఇటీవల బదిలీ అయ్యారు. అవ్వగా ఆయన స్థానంలో తులసీరామ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు పలువురు స్టేషన్ సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

మన్నూరు అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు

రాజంపేట అర్బన్ :పురపాలక పరిధిలోని మన్నూరు అంగన్వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా గర్భిణులు, బాలింతలు, మహిళలకు అంగన్వాడీ కార్యకర్తలు తల్లిపాల పట్ల అవగాహన కల్పించారు. తల్లి కాన్పు అయిన తర్వాత మొదటగా వచ్చే ముర్రు పాలలో



అవగాహన కల్పిస్తున్న కార్యకర్తలు

వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని, ఈ ముర్రుపాలు శిశువుకు మొదటి టీకాతో సమానమని తెలిపారు. శిశువుకు ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ఎటువంటి అదనపు ఆహారం ఇవ్వకూడదని వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఎం.విజయమ్మ, శివ జ్యోత్స్న, లక్ష్మీ ప్రసన్న, హరిత, భాగ్యలక్ష్మి, కల్యాణి, రాఖియా, చాముండేశ్వరి, గర్భిణులు, బాలింతలు, మహిళలు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న సొసైటీ సభ్యులు

రూ.8 వేల ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్థానిక నీరుగట్టువారిపల్లి వివేకానంద స్కూల్‌లో అమ్మ సర్వీస్ సొసైటీ ద్వారా హిందీ సబ్జెక్ట్‌కి మమత అనే వాలంటీర్‌ని ఏర్పాటు చేశారని, దానికి సంబందించిన నెల సరి వేతనం రూ.8 వేలు చెక్ అందిం చామని అమ్మ సర్వీస్ సొసైటీ సెక్రటరీ పెద్దకోట్ల గణేష్, జాయింట్ సెక్రటరీ జయకృష్ణ తెలిపారు. ఈ చెక్‌ను డాక్టర్ జి.వి.ఎస్.బాబు, కానిస్టేబుల్ రామూర్తి, వివేకానంద స్కూల్ హెడ్మాస్టర్ రాజేంద్ర ప్రసాద్, శ్రావ్యాస్ ఇన్ఫోటెక్ వ్యవస్థాపకులు మోహన్ ద్వారా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా మరిన్ని సేవలు అందించడానికి ఎప్పుడు ముందుంటామన్నారు. సహకరించిన ప్రతి ఒక్కరికి అమ్మ సర్వీస్ సొసైటీ ద్వారా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

80 శాతం రాయితీతో రైతులకు ఉలవలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వర్షాభావ పరిస్థితుల వలన ఇంత వరకు వర్షాధారంగా పంటలు సాగుచేయని రైతులకు 80 శాతం రాయితీపైన ఉలవ విత్తనాలు అందజేస్తామని మండల వ్యవసాయ అధికారి నాగప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఉలవలు అవసరమైన రైతులు తమకు సంబంధించిన రైతు భరోసా కేంద్రంలో వారి యొక్క వివరాలు సమర్పించి అనగా ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్ తదితర విషయాలను సమర్పించి ఆగస్టు 8వ తారీకులోపు ముందస్తుగా నమోదు చేసుకోవాలన్నారు. రైతులు నమోదు చేసుకున్న జాబితాలను ఆగస్టు 12వ తేదీ వరకు సామాజిక తనిఖీ నిమిత్తం రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించి ఏవేని మార్పు,చేర్పులు ఉన్నట్లయితే తుది జాబితా ఆగస్టు 13వ తారీఖున తయారు చేసి,ఆగస్టు 14వ తారీఖున పూర్తి జాబితాలను ఆన్లైన్లో నమోదు చేస్తారన్నారు.తదుపరి రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలను సరఫరా చేసిన తర్వాత పంపిణీ కార్యక్రమం మొదలవుతుందన్నారు. కావున రైతులందరూ కూడా గడవులోగా అనగా ఆగస్టు 8వ తారీఖులోగా ఆయా రైతు భరోసా కేంద్రాలలో ప్రత్యామ్నాయ విత్తనం కొరకు నమోదు చేసుకోవాలని ఆయన వెల్లడించారు.

స్పందన ఫిర్యాదులను పరిష్కరించండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులపై తగిన చర్యలు తీసుకోవాలని పురపాలిక చైర్‌పర్సన్ మనూజారెడ్డి తెలిపారు. సోమవారం పురపాలిక కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ప్రజలు తీసుకొచ్చిన అర్జీలను తీసుకున్నారు. మొత్తం నాలుగు సమస్యలు వచ్చాయన్నారు. డోర్ నెంబర్ 17-444-9-4 గల ఇంటికి నీటి కులాయి నెం.డబుల్ ఎంట్రీ ఉందని కన్జూమర్ నెం:1009001232ను తొలగించాలని, గాంధీపురంలో పరిశుధ్య కార్మికులు 12 మంది నెల వారి జీతం రూ.10 వేలు మాత్రం ఇచ్చి మిగిలిన పైకం సెక్రటరి తీసుకున్నారనీ, ఆర్‌టిసి బస్టాండు దగ్గర పాత కాలువ నీరు అంత భూమి లోపల పోతున్నాయనే సమస్యలు వచ్చినట్లు తెలిపారు. పైవచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కార నిమిత్తం అదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

కంప్యూటర్ ఆపరేటర్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి -సంబేపల్లి (రాయచోటి)

సంబేపల్లి మండలం తహశీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న రమేష్ బాబు పై చర్య తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ పార్లమెంట్. కార్యదర్శి మట్లి శ్రీనివాస నాయుడు సోమవారం స్పందనలో అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహశీల్దార్ కార్యాలయంలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న రమేష్ బాబు అధికార పార్టీకి అనుకూలముగా స్థానిక గ్రామీణ ప్రాంతాలలో ఓట్లు చేర్పిస్తున్నారని పేర్కొన్నారు. కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా కూడా విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు .తప్పుడు రెవెన్యూ రికార్డును సృష్టించి ఎవరు ఎక్కువ డబ్బులు ఇస్తే వారికి ఆన్‌లైన్ చేస్తున్నారన్నారు. అతను కేవలం ఎలక్షన్ డ్యూటీ మాత్రమే విధులు నిర్వహించాలని తెలిపారు. దీనిపైన స్థానిక తహశీల్దార్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. కంప్యూటర్ ఆపరేటర్‌పై తగిన చర్య తీసుకోవాలని స్పందనలో అర్జించినట్లు శ్రీనివాస్ నాయుడు పేర్కొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడండి

ప్రజాశక్తి–వాల్మీకిపురం

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కను నాటి దానిని సంరక్షించాల్సిన బాధ్యత తీసుకోవాలని సూచించారు. పంచాయతీ అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది శ్రద్ధ తీసుకొని పట్టణంలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా మొక్కలను నాటించి, వాటిని సంరక్షించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. అనంతరం కానగ, వేప, దానిమ్మ, ఉసిరి, అల్లనేరేడు, జామ తదితర మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగులమ్మ, ఉపసర్పంచ్ కేశవ రెడ్డి, ఇఒ ఉదయ్ కుమార్, నాయకులు చింతల ఆనంద రెడ్డి, నీళ్లభాస్కర్, సురేష్, రఘు, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నుంచి వైసిపిలోకి చేరికలు

ప్రజాశక్తి–వాల్మీకిపురం

రాబోవు ఎన్నికల్లో వైసిపి విజయం తథ్యమని, మళ్లీ వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం కెవిపల్లి మండలం జిల్లేలమంద పంచాయతీ అగ్రంరెడ్డిగారిపల్లికి చెందిన టిడిపి ముఖ్య నాయకుడు వేణుగోపాల్ రెడ్డి పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో వాల్మీకిపురం మండలం తాటిగుంటపల్లికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు నారెం కిషోర్ కుమార్ రెడ్డి ఏపీ ఎండిసి డైరెక్టర్ హరీష్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. వీరికి వైసిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వా నించారు. కార్యక్రమంలో నాయకులు దండు జగన్మోహన్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, మల్లికార్జునరెడ్డి, ద్వారకనాథరెడ్డి, జగన్నాథరెడ్డి, రామలింగారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, నాగసిద్దారెడ్డి, యల్లయ్య పాల్గొన్నారు.



టిడిపి నాయకులకు కండువా వేస్తున్న చింతల



ఓటరు జాబితా సర్వే చేస్తున్న బిఎల్‌ఒలు

ఓటరు జాబితాలో సవరణకు సర్వే

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలోని కరెంట్ కాలనీ జయశ్రీ కాలనీలో ఓటర్ జాబితా సవరణ-2024 కార్యక్రమంలో భాగంగా సోమవారం ఇంటింటా సర్వే నిర్వహించారు. 148వ బిఎల్ఒ ఒకటవ సచివాలయం వెల్ఫేర్ మౌలా పరివేక్షణలో ఈ సర్వే జరిగింది.ఓటర్ జాబితాలో చేర్పులు, మార్పులు కొత్తగా ఓటర్ నమోదుకై కేంద్ర ఎన్నికల సంఘం ఈనెల 21 వరకు అవకాశం కల్పించిందన్నారు. అందుకుగాను ఓటర్ జాబితాను పరిశీలనకు వైసిపి168 బూత్ కన్వీనర్ చాంద్ బాషా పరిశీలించగా, బిఎల్ఒ బూత్ కన్వీనర్ జనార్ధన్, ఓటర్ సవరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి

ప్రతి రైతుకు న్యాయం జరగాలి

ప్రజాశక్తి-గాలివీడు

పంట సాగు చేసిన ప్రతి రైతుకు న్యాయం జరగాలని మండల వ్యవసాయ అధికారి మురళీధర్ పేర్కొన్నారు. సోమవారం కొర్లకుంట రైతు భరోసా కేంద్రం వద్ద సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించే ప్రతి పంట కోత ప్రయోగాలపై మండల స్థాయి శిక్షణ కార్యక్రమం ఇస్తు దచీశీఅవగన్నట్లు తెలిపారు. రైతులకు లాభం చేకూర్చే విధంగా వ్యవసాయ అధికారుల సూచనలు రైతులు తప్పక పాటించాలని పేర్కొన్నారు. పంటసాగుల ఖర్చులు కూడా తగ్గించుకోవడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని వీటన్నిటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్టాటిస్టికల్ ఆఫీసర్ బాలరాజు అగ్రికల్చర్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

దళితులకు సముచిత స్థానం

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని దళితులకు అసైన్డ్ భూముల కేటాయింపులో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే మేడావెంకట మల్లికార్జునరెడ్డి, ఎంపిపి మేడా విజయభాస్కర్ రెడ్డిలు తహశీల్దార్‌కు సూచించినట్లు ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ కమిటీ సభ్యులు పెనుబాల నాగసుబ్బయ్య, ఆర్ముగం విశ్వనాధ్, కాకిచంద్రలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఎక్కడ మిగులు భూములు ఉంటే ఎస్‌సి, ఎస్‌టిలకు సముచితక స్థానం కల్పించాలని, అనుభవంలో ఉన్న దళితుల భూములకు చట్టబద్ధత కల్పించి, ఆన్‌లైన్‌లో చేర్చి పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రెవిన్యూ అధికారులకు వారు సూచించడం జరిగిందని అన్నారు. మండల కేంద్రానికి ఐదు కిలోమీటర్ల లోపల ఉన్న భూములను ప్రభుత్వ, ప్రజల అవసరాలకు కేటాయించాలన్న ప్రభుత్వ జిఒను కచ్చితంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో దళిత నాయకులు రామచంద్ర, నరసింహులు, పెంచలయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌సి,ఎస్‌టి మానిటరింగ్ సభ్యులు

యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని నల్లగుట్టపల్లె గ్రామంలో సోమవారం ఉద్యానశాఖ అధికారిని టి.నాగమణి ఆధ్వర్యంలో కూరగా దచీశీఅవగయల సాగులో పాటించవలసిన యాజమాన్య పద్ధతులు, సమగ్ర సస్యరక్షణ చర్యలపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూరగాయల సాగులో విత్తనశుద్ధి, ఎరువుల యాజమాన్యం, సూక్ష్మ దాతు లోపాలు నివారణ, నీటి యాజమాన్యం, పంటను ఆశించే చీడపీడలు, తెగుళ్ల నివారణ , పూత పిందె దశలో తీసుకో వలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. టమోటా పంటపై సూదిపురుగు ఆశించడం వలన దిగుబడి, నాణ్యత తగ్గే అవ కాశం ఉందన్నారు. నాణ్యమైన నారు మొక్కలను చూసి తెచ్చు కుని నాటుకోవాలన్నారు. లోతు దిక్కులు చేసుకున్నట్లయితే పొలంలోని ప్యూప దశలు ఎండిపోయి చనిపోతాయని అన్నారు. మొక్కలు నాటిన 20 రోజులు తర్వాత ఎకరాకు 10 చొప్పున నీటి ఎరలు,ఫెరముని ఎర్రలు లేదా దీపపు ఎరలు ఉంచాలి. వాటికి మగరెక్కల పురుగులు ఆకర్షించబడి నీటిలో పడి చనిపోతా యన్నారు. ఎకరాకు 25 నుంచి 40 చొప్పున పసుపు, నీలం రంగుల జిగురు అట్టలను ఏర్పాటు చేసుకుంటే రసం పీల్చే పురుగులతో పాటుగా సూది పురుగులు చిగురాకుకి అంటు కుంటాయన్నారు. సూది పురుగు నివారణకు మొదటిగా వేప నూనెను 5మి.మీ. ఒక లీటర్ నీటికి కలుపుకొని పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానశాఖ అధికారి

ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం



ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మండల పరిధిలోని కె.బుడుగంటపల్లి పంచాయతీలోని బుడుగుంటపల్లి హరిజనవాడలో నిర్మిస్తున్న సీతారాముల ఆలయ నిర్మాణానికి ముక్కారూపానందరెడ్డి ఫౌండేషన్ అధినేత రూపానందరెడ్డి ఆయన సతీమణి వరలక్ష్మి ఆధ్వర్యంలో రూ.5లక్షల చెక్కును ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులకు అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ముక్కావారిపల్లి, రైల్వే కోడూరు, చిట్వేలి, పెనగలూరు, నాలుగు మండలాల్లో ఉచిత కంటి శిబిరం నిర్వహించి ఎంతో మంది పేదలకు దృష్టి అందించారన్నారు. గుడికి, మసీదుకి, చర్చికి, నిత్యం విరాళాలు ఇస్తూ తన దాతృతాన్ని చాటుకున్నారని అన్నారు. ఎంతోమంది పేదలకు రోడ్డు ప్రమాదాలు జరిగిన మేమున్నామంటూ ముందుండి విరాళాలు ఇవ్వటం, పేద పిల్లలకు, చదువులకి ఫీజులు కట్టలేక ఇబ్బందులు పడే వారికి ఆర్థిక సాయం చేయడం వంటి ఎన్నో సేవా కార్యక్రమాలను ఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తున్నారని కొనియడారు. కార్యక్రమంలో సర్పంచ్ అరవ శ్రీధర్, వేణుగోపాల్‌రెడ్డి, శ్రీరాములవారి గుడి కమిటీ సభ్యులు, గుడి గౌరవ అధ్యక్షులు సర్పంచ్ దార్ల చంద్రశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

చంద్రబాబుది రెచ్చగొట్టే నైజం : వైసిపి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

వైసిపి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక టిడిపి అధ్యక్షులు చంద్రబాబునాయుడు టిడిపి కార్యర్తలను రెచ్చగొట్టి విధ్వంసానికి పాల్పడుతున్నారని రైతు సలహామండలి జిల్లా చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికా రంలోకి వచ్చి నాలుగేళ్ల పూర్తయిందని అందులో రెండు సంవత్సరాల పాటు కరోనాతో ఇబ్బందులు పడ్డామని , మిగతా రెండు సంవత్సరాల్లో రాష్ట్రంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టా మని అన్నారు. నవరత్నాల ద్వారా ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తుంటే రాష్ట్రాన్ని శ్రీలంక చేస్తారా, ప్రజలను సోమరిపోతులను చేస్తారా అంటూ విమర్శించిన ఆ పెద్దమనిషి చంద్రబాబని అన్నారు. ప్రజా సంక్షేమాన్ని చూసి ఓర్వలేక పుంగనూరు పర్యటనలో ప్రజలను రెచ్చగొట్టి గ్రామాలలో కక్షలు రేపుతున్నారని అన్నారు. నలభై ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న వ్యక్తి ప్రవర్తించే తీరు ఇదేనా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి పాలెంకోట రత్నమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ ముద్దులూరు సుబ్బరామరాజు, వైసిపి నాయకులు సిహెచ్ రమేష్, టూరిజం డైరెక్టర్ మందల నాగేంద్ర, రాజారెడ్డి, శివారెడ్డి, బుల్లెట్ శివ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుకుమార్‌రెడ్డి

వార్డు మెంబర్ల ఎన్నికలకు నోటిఫికేషన్

ప్రజాశక్తి-కలకడ

మండలంలో రెండు వార్డు మెంబర్ల ఎన్నికలకు నోటిఫికేషన్ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసినట్లు ఎంపిడిఒ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. మండలంలోని కలకడ ఒకటో వార్డు, నడమిచర్ల ఆరో వార్డు ఎన్నికలకు గాను నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. కలకడ వార్డ్ నెంబర్‌కు అన్ రిజర్వుడు స్త్రీలు, నడిమిచర్ల ఆరవవార్డు మెంబర్‌కు రిజర్వుడు వ్యక్తులు నామినేషన్లు దాఖలు చేయవచ్చునని తెలిపారు.ఈనెల 8వ తేదీ నుండి నామినేషన్లు స్వీకరణ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం5 గంటల వరకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని, ఈనెల 10న చివరి తేదీ అని, 11న పరిశీలన, 12వ ఆక్షేపణ ,13వ తేదీనన తిరస్కరణ ,14న నామినేషన్లు విత్‌డ్రాలు, ఈనెల 19వ తేదీన ఎన్నికలు నిర్వహించిన అనం తరం, అదే రోజు సాయంత్రం రెండు గంటలకు కౌంటింగ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.అనంతరం 20న గెలుపొందిన వారికి గెలుపు పత్రములు అందజేయడం జరుగు తుందని పేర్కొన్నారు. **ములకలచెరువు :** పిటిఎం మండలంలో ఖాళీగా ఉన్న మూడు పంచాయతీ వార్డులకు ఎన్నికల కమిషన్ ఎన్నికల తేదీలను ఖరారు చేసినట్లు ఎంపిడిఒ గిరిధర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని రాపూరివారిపల్లి పంచాయతీ 7, వార్డు , తుమ్మరకుంట పంచాయితీలోని 8 వార్డు, మల్లెల పంచా యతీలో 6 , వార్డులకు ఈ నెల 10 వతేదీన నామినేషన్లు, 11, స్క్రోటినీ, 12, అప్పీల్, 14న నామినేషన్ల ఉపసంహరణ, 19 తేదీన పోలింగ్ జరుగుతుందన్నారు . ఎన్నికల అధికారిగా ఎంఇఒ నారాయణ విధులు నిర్వహి స్తారన్నారు. **గాలివీడు:** పంచాయతీలో ఐదోవార్డు, పదో వార్డు మెంబర్లకు ఎన్నిక ఈనెల 19న ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ శేఖర్ నాయక్ పేర్కొన్నారు. నామినేషన్లు ఎనిమిదో తేదీ నుంచి పదో తేదీ వరకు చివరి తేదీ అని స్క్రూటీని 11న, 14న విత్‌డ్రా, 19న ఎన్నికలు జరుగు తాయన్నారు. ఉప సర్పంచ్ ఎన్నిక కూడా 19వ తేదీ మధ్యాహ్నం నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సిడిపిఒ పద్మావతి

తల్లిపాలే బిడ్డకు అమృతం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయష్కరమని లక్కిరెడ్డిపల్లె ప్రాజెక్టు సిడిపిఒ పద్మావతి పేర్కొన్నారు. తల్లి పాలు వారోత్సవాలలో భాగంగా సోమవారం స్థానిక బాలసదనం సమీపంలో ఉన్న అంగన్వాడి కేంద్రం నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ పుట్టిన బిడ్డ కు ముర్రిపాలు తాపించాలన్నారు. గర్భం దాల్చిన వెంటనే అంగన్వాడి కేంద్రంలో పేరు నమోదు చేయించుకోవాలన్నారు. శిశువు పెరుగుదల నుంచి ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ప్రతినెల వైద్యులను సంప్రదించి టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందిస్తున్న జగనన్న బాలామృతం, పాలు, గుడ్డు, ఆకుకూరలు సక్రమంగా తీసుకోవాలన్నారు. బిడ్డకు రెండు సంవత్సరాలు వచ్చే అంతవరకు తల్లిపాలు తప్పనిసరిగా అందించాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్లయ్య కొండపై భక్తుల తాకిడి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల సమీపంలోని మల్లయ్య కొండలో వెలసిన శ్రీభ్రమరాంబిక మల్లికార్జున స్వామి దర్శనానికి భక్తుల తాకిడితో ఆలయం కిటకిటలాడింది. భక్తులకు పూజారి ఈశ్వరప్ప, మల్లికార్జునయులను ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేసి అభిషేకాలను నిర్వహించారు.ఆలయానికి సమీపంలోని గౌరమ్మ గుడిలో సోమవారం మహిళలు పెద్ద ఎత్తున సంతాన ప్రాప్తి కోసం అమ్మవారి సన్నిధిలో సాష్టాంగ నమస్కారంతో వరపడ్డారు. ఉదయం గౌరీమాత ఆలయం అర్చకులు శేఖర్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, ధూప దీప నైవేద్యాలు, సహస్రనామార్చన నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

ప్రజా ఫిర్యాదులకు సత్వర పరిష్కారం : ఎస్‌పి

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

స్పందన కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులపై సకాలంలో స్పందించి చట్ట ప్రకారం పరిష్కారం చూపాలని ఆయా అర్జీలకు ప్రాధాన్యత ఇచ్చి నిర్ణీత సమయంలోగా విచారించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఎస్‌పి గంగాధర్‌రావు పోలీసు అధికారులును ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలు వారి సమస్యలను ఎస్‌పికి విన్నవించుకున్నారు. 71మంది ఫిర్యాదిదారులు తమ తమ అభ్యర్ధనలను ఎస్‌పికి వివరించారు. ఫిర్యాదు దారులతో ముఖాముఖి మాట్లాడి , వీడియో కాన్ఫరెన్స్, టెలి కాన్ఫరెన్స్ లో వారి సమస్యలును అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి, బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని భరోసా ఇచ్చారు. ఫిర్యాదు మేరకు తీసుకున్న చర్యల నివేదికను ఎప్పటికప్పుడు ఎస్‌పి కార్యాలయానికి అందించాలని ఆదేశించారు.



ఫిర్యాదు దారులతో మాట్లాడుతున్న ఎస్‌పి

నేతన్నల జీవితాల్లో వెలుగులు

జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ వి.విజయ్ రామరాజు



జాతీయ చేనేత దినోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

ప్రజాశక్తి - కడప అర్బన్

చేనేత కుటుంబాల ఆర్థిక అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వారి జీవితాల్లో వెలుగులు నింపుతోందని కలెక్టర్ వి.విజయ్ రామరాజు పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ విసి హాలులో చేనేత, జౌళి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 9వ జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కలెక్టర్‌తోపాటు రాష్ట్ర పద్మశాలీ కార్పొరేషన్ చైర్మన్ జింకా విజయలక్ష్మి, జాతీయ చేనేత ఐక్య వేదిక కన్వీనర్ అవ్వారు మల్లికార్జున, రాష్ట్ర దేవంగ కార్పొరేషన్ చైర్మన్ రాగా నరసింహులు, జిల్లా ఆప్కో డిఎంఒ వి.వరప్రసాద్, ఆప్కో డైరెక్టర్ ఉదయగిరి వెంకటేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మగ్గాలనే నమ్ముకొని జీవనోపాధి పొందుతున్న నేతన్నలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'వైఎస్ఆర్ నేతన్న నేస్తం' ద్వారా మగ్గం ఉన్న ప్రతి చేనేత కుటుంబానికీ ఏడాదికి రూ.24 వేల ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. చేనేత వృత్తిని ప్రోత్సహించడానికి వివిధ సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుం దన్నారు. వారి ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం కల్పించ డానికే రాష్ట్ర ప్రభుత్వం ఆప్కో ప్రవేశ పెట్టి నేతన్నలు తయారు చేసిన వస్త్రాలను ఆప్కో ద్వారా కొనుగోలు చేసి విక్రయి స్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ రకాలుగా కార్మికులకు రాయితీలు ఇస్తుందని వివరించారు

ఆకట్టుకున్న ఆప్కో చేనేతల స్టాల్

జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక విసి హాలులో ఏర్పాటు చేసిన ఆప్కో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా వారు ఉత్పత్తి చేసి, అమ్మకానికి సిద్ధంగా ఉన్న పలురకాల సంప్రదాయ నూలు, పట్టు వస్త్రాలు ఉత్పత్తులను జిల్లా కలెక్టర్ పరిశీలించి అభినందించారు.

చేనేత సంఘాల ర్యాలీ

అంతకు ముందు జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో నగరంలోని స్టేట్ గెస్ట్ హౌస్ నుంచి వన్ టౌన్ గాంధీ బొమ్మ వరకు చేనేత సంఘాల నాయకులు, చేనేత కార్మికులు.. సంప్రదాయ చేనేత వృత్తిని ప్రోత్సహిస్తూ ఆ రంగాన్ని బలోపేతం చేయాలని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా చేనేత, జౌళు శాఖ సహాయ సంచాలకులు వి.హరికృష్ణ, డివో కృష్ణ, ఏడివోలు శేషగిరి, అహ్మద్ రవి ప్రకాష్ రెడ్డి, సబార్డినేటర్స్ జయరాం, బాలకృష్ణ, తొగత వీర క్షత్రియ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సూర్యనారాయణ, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా నరసింహా రావు, ప్రధాన కార్యదర్శి సుంకర రామచంద్రుడు, కోశాధికారి టేకూరి సుదర్శన్, గౌరవ అధ్యక్షులు ఉమ్మడిశెట్టి సుబ్రహ్మణ్యం, వెలిగండ్ల సుబ్బరాయుడు, బొలిశెట్టి వెంకటస్వామి, జిల్లా చేనేత జౌలు శాఖ, ఆప్కో సిబ్బంది, కాంచన. శివప్రసాద్, పి, ప్రసాద్ పాల్గొన్నారు.



చేనేత ర్యాలీలో పాల్గొన్న చేనేత సంఘం నాయకులు, చేనేత కార్మికులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

గృహ నిర్మాణ లక్ష్యాన్ని సాధించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కడప సిటీ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టి అమలు చేస్తున్న జగనన్న గృహాలను వేగవంతంగా పూర్తిచేయాలని కలెక్టర్ వి. విజయ్ రామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టోరేట్ సభా భవన్ నుంచి జెసి జి.గణేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ భరద్వాజ్, డిఆర్ఒ గంగాధర్ గౌడ్, హౌసింగ్ పీడీ క్రిష్ణయ్యతో కలిసి జగనన్న హౌసింగ్ కాలనీల్లో గృహ నిర్మాణ పనుల పురోగతి, మౌలిక వసతులు, జగనన్న సంపూర్ణ గృహహక్కు, అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు తీరు, పురోగతి, సర్వీసు రిక్వెస్టులు–పరిష్కారాలు తదితర అంశాలతో కూడిన ఎజెండాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమయాన్ని వృథా చేయకుండా జగనన్న హౌసింగ్ కాలనీల నిర్మాణ పనుల్లో పురోగతి సాధించాలన్నారు. ప్రతి ఒక్కరికీ ఇల్లు ఇవ్వాలన్నదే ముఖ్యమంత్రి ప్రధాన ఉద్దేశమని చెప్పారు. అర్హత ఉన్న ప్రతి పేద వారికి ఇంటి స్థలం, సొంత ఇల్లు ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టి అమలు చేస్తున్న సేవలు, సంక్షేమ పథకాలు ప్రజలకు సంతృప్త స్థాయిలో అందాలనే ప్రభుత్వ లక్ష్యం మేరకు ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పని చేయాలన్నారు. సంబంధిత అధికారులు లక్ష్య సాధన కోసం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి వారమూ ప్రగతి నివేదికలు అందజేయాలన్నారు. ప్రధానంగా జగనన్న హౌసింగ్ కాలనీల నిర్మాణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని చెప్పారు. ఆయా మండలాలు, మున్సిపాలిటీల పరిధిలోని లేఅవుట్లలో గృహ నిర్మాణ పనుల పురోగతిపై ఒక్కొక్కరిని అడిగి తెలుసుకున్నారు. లే అవుట్ పూర్తయినవి, పూర్తి కానివీ, గ్రౌండింగ్ స్టార్ట్ అయినవి, మేస్త్రీలతో టై అప్, ఇసుక, ఐరన్, సిమెంట్ మొదలైన మెటీరియల్, ఫైనాన్స్ అసిస్టెన్స్ మొదలైన అన్ని రకాల సదుపాయాలను సమకూర్చి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. జగన్నన గృహ నిర్మాణాలలో ఎలాంటి లోటుపాట్లకు తావివ్వక పూర్తి అవగాహనతో లక్ష్యాలను అధిగమించాలని అన్నారు. పేదల ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి కనిపించాలని, వెనకబడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రారంభంకాని ఇళ్లన్నీ సత్వరమే ప్రారంభించి బిబిఎల్ స్థాయిలో ఉండేలా చూడాలన్నారు. పేదల ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందనే విషయాన్ని ప్రతి ఒక్కరు దృష్టిలో పెట్టుకుని పనిచేయాలని పేర్కొన్నారు. జగనన్న గృహ నిర్మాణాలలో ముఖ్యంగా విద్యుత్, నీటి సరఫరాకు త్వరితగతిన అన్ని ఏర్పాట్లు చేయాలని చెప్పారు. గృహ నిర్మాణ పనుల్లో అధికారులు చిత్త శుద్ధితో పనిచేసి నిర్దేశించిన, ఆశించిన పురోగతిని చూపాలని అన్నారు. అధికారులు చేసిన పనిని ఆన్ లైన్లలో నమోదు చేయాలని అన్నారు. కార్యక్రమంలో బద్వేలు, పులివెందుల, జమ్మలమడుగు ఆర్‌డిఒలు వెంకట రమణ, వెంకటేష్, శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులైన నియోజకవర్గ, మండల ప్రత్యేకధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యారు.

వైద్య విద్యను సామాన్యులకు దూరం చేయకండి

ప్రజాశక్తి - కడప అర్బన్



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు

రాష్ట్ర ప్రభుత్వం నూతన మెడికల్ కళాశాలల్లో సీట్ల అమ్మకం ఆపి పాత పద్ధతిలోనే ఎ కేటగిరీ ద్వారానే సీట్ల భర్తీ జరగాలని సిపిఎం నగర కార్యదర్శి రామ మోహన్ డిమాండ్ చేశారు. సోమవారం ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట సిపిఎం నగర కమిటీ అధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాల సీట్లు అమ్మకం ద్వారా ఆదాయాన్ని సమకూర్చాలనుకోవడం సరైన చర్య కాదని విమ ర్శించారు. మెడికల్ కళాశాలల్లో సీట్ల అమ్మకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ఆదాయం కేవలం రూ .40 కోట్లు మాత్రమే అన్నారు. ఇది ప్రభుత్వానికి పెద్ద భారం కాబోదన్నారు. ప్రయివేట్ కళాశాలలో మాదిరిగానే ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లోనూ ప్రతిభకు కాకుండా డబ్బులున్న వారికే సీటు కట్టబెట్టే ప్రయత్నం చేస్తు న్నారని తీవ్రంగా విమర్శించారు. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం జులై 19న జీవో నంబర్ 107 తీసుకువచ్చి విద్యార్థుల్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన కళాశాలల్లో 750 సీట్లకు అనుమతి వచ్చిందని అన్నారు. వీటిలో 113 సీట్లు ఆల్ ఇండియా కోటాలో భర్తీ చేస్తారని, మిగిలిన 637 సీట్లను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఏ కేటగి రిలో రిజర్వేషన్ అనుసరించి ప్రతిభ ఉన్న వారితో భర్తీ చేయాల్సి ఉందన్నారు. అలా కాకుండా 319 సీట్లను అమ్మకానికి పెట్టి ప్రతిభ గల విద్యార్థులకు విద్య అందుబాటులో లేకుండా చేసిందని విమర్శించారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని తక్షణమే ఈ భారాన్ని రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరి రెడ్డి, నగర కమిటీ సభ్యులు గోపాల కృష్ణయ్య, ఓబులేసు, ఫారుక్ , అన్వర్, శివకుమార్, షాకీర్, ఎమ్మార్ నాయక్, సునీల్, రెబ్బ నరసింహ, కామేశ్వరమ్మ, సరిత, రామకృష్ణారెడ్డి, మాధవ రెడ్డి, విజయ్, శివరాం, రవి, పాలయ్య, శ్రీనివాసులు, సురేష్ పాల్గొన్నారు.

బిసి కుల, జనగణనను కేంద్ర ప్రభుత్వం చేపట్టాలి

కడప అర్బన్ : బిసి కుల, జనగణనను వెంటనే చేపట్టాలని బిసి సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. చలో తిరుపతి కార్యక్రమ సందర్భంగా జిల్లా బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 60 మంది సభ్యులు తిరుపతిలో నిర్వహించిన బిసి జాతీయ ఒబిసి మహాసభకు సోమవారం హాజరయ్యారు. క్రిమిలేయర్‌ను వెంటనే కేంద్రం రద్దు పరచాలని పేర్కొన్నారు కేంద్ర ప్రభుత్వంలో ప్రత్యేకంగా బిసిలకు మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని సమావేశంలో డిమాండ్ చేశారు. సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బత్తల లింగమూర్తి ఆధ్వర్యంలో హాజరయ్యారు. జిల్లా ముఖ్య సలహాదారు సుంకేసుల ఖాదర్‌బాషా, రాష్ట్ర మహిళా కార్యదర్శి తొలివేముల జయశ్రీ, జిల్లా ఉపాధ్యక్షులు పస్తాం అంజి,ఆర్ మునిరత్నం గౌడ్సు, సుధాకర్, కోశాధికారి మనుబోలు శ్రీనివాసులు, యువజన అధ్యక్షులు సిఆర్‌ఐ సునీల్, నగర కమిటీ అధ్యక్షులు త్రివిక్రమ్ రావు, మైదుకూరు నియోజకవర్గం అధ్యక్షులు కొత్తల బైరవుడు, జిల్లా నాయకులను సరోజమ్మ, లక్ష్మీ, సత్య, జయలక్ష్మి, గోవింద నాగరాజు పాల్గొన్నారు.

చేనేతల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

ప్రజాశక్తి - జమ్మలమడుగు

చేనేతల సంక్షేమానికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతూ వారి అభ్యున్నతికి కృషి చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. జాతీయ చేనేతల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని మూడు రోడ్లు సర్కిల్ వద్ద ఉన్న తొలి శాసనసభ్యులు కుండా రామయ్య విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి అధికారం చేపట్టిన నాటి నుండి చేనేతల సంక్షేమానికి పాటు పడుతోందన్నారు. నేతన్న నేస్తం పథకం ద్వారా నియోజకవర్గంలో అత్యధికంగా లబ్ధిదారులకు రూ.24,000 అందిస్తున్నామన్నారు. జమ్మలమడుగు నుండి ఒక బిసి చేనేత వర్గానికి చెందిన మహిళకు రాష్ట్ర క్యాబినెట్ హోదా కల్పిస్తూ హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చారన్నారు. జమ్మలమడుగు పరిసర ప్రాంత చేనేతలకు ప్రభుత్వం మూడు క్లస్టర్లు ఏర్పాటు చేసి 300 మగ్గాలు అందించామన్నారు. ఇటీవలే ప్రతిపక్ష నేత చంద్రబాబు పర్యటించి బిసి, చేనేత వర్గాలను అవమానించారన్నారు. 2024 ఎన్నికల్లో వైసిపికి చేనేత వర్గాలు అండగా నిలవాలని ఎమ్మెల్యే కోరారు. అనంతరం ప్రముఖ హస్త కళాకారులకు, చేనేతలకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర హస్త కళల కార్పొరేషన్ చైర్‌పర్సన్ బడిగింజల విజయలక్ష్మి, బిసి జాతీయ కార్యదర్శి బడిగింజల చంద్రమౌళి, వేపరాల ఎంపిటిసి ఎ.కుమార్, దొమ్మరనంద్యాల ఎంపిటిసి గుడిపాటి రామయ్య, మార్కెట్ యార్డ్ చైర్మన్ రమణారెడ్డి, పార్టీ చేనేత నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


చేనేత కళాకారులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వైసిపి పాలనలో గిరిజనులపై దాడులు


మాట్లాడుతున్న టిడిపి పార్లమెంటు ఎస్‌టి సెల్ అధ్యక్షులు రవికుమార్

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపి ప్రభుత్వం పాలనలో రాష్ట్రంలో గిరిజన, దళితులపై ఎక్కువగా దాడులు జరుగుతున్నాయని టిడిపి కడప పార్లమెంట్ ఎస్‌టి సెల్ అధ్యక్షులు మేదర రవికుమార్ పేర్కొన్నారు. స్థానికంగా సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నాలుగేళ్ల కాలంలోనే గిరిజనులపై, దళితులపై దాడులు జరుగుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో తెలిపిందన్నారు. జాతీయ నేర రికార్డుల బ్యూరో గణాంకాల ప్రకారం గిరిజనులపై 2019లో 330, 2020లో 320, 2021లో 361 దాడుల కేసులు నమోదైనట్లు వివరించారు. దళితులకు సంబంధించి 2019లో 2071కేసులు అత్యధికంగా నమోదయ్యాయని తెలిపారు. 2020లో 1950, 2021లో 2014 కేసులు నమోదు కాగా, 2022-2023కు సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉందని కేంద్ర మంత్రి వివరించారన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో గిరిజనులకు సరైన రోడ్డు సదుపాయం లేక గర్భిణులు, వృద్ధులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే గిరిజనులు, దళితులపై జరిగే దాడులను అరికట్టాలన్నారు. గిరిజనులు, దళితుల సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయాలని కోరారు. దాడులు ఇలాగే కొనసాగితే 2024 ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వానికి గట్టిగా బుద్ధి చెప్తారని అన్నారు. విలేకరుల సమావేశంలో రాజా నాయక్, మహేష్, మురళి, హరి, శివకుమార్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు 'బీరం' విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని కొత్త నెల్లూరు సమీపంలోని బీరం శ్రీధర్‌రెడ్డి పాఠశాల విద్యార్థులు క్రీడల్లో జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. కడప నగరం స్పోర్ట్స్ అకాడమీ డిఎస్‌ఎ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి సీనియర్ బాలుర విభాగంలో పదవ తరగతి చదువుతున్న కె.ఉదయ్, జి.హర్షిత.. జూనియర్ వాలీబాల్ బాలుర విభాగంలో పదవ తరగతి చదువుతున్న వై.సుశాంత్, సి.జానకిరామ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు అర్హత సాధించారు. షూట్‌బాల్ జూనియర్స్ బాలుర విభాగంలో బీరం శ్రీధర్‌రెడ్డి కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న టి.గురు పవన్, ఎన్.సుబ్బారెడ్డి, సి.సుశాంత్ జిల్లాస్థాయిలో గెలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ బీరం సుబ్బారెడ్డి, చైర్ పర్సన్ సరస్వతమ్మ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా బీరం సుబ్బారెడ్డి, డైరెక్టర్ స్వాతి శ్రీకాంత్ మాట్లాడుతూ తమ విద్యాసంస్థల విద్యార్థులు వాలీబాల్, షూట్‌బాల్ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. విజేతలను, శిక్షకులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ హేమ్‌చందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఎంపికైన విద్యార్థులతో బీరం సుబ్బారెడ్డి

భ్రూణ హత్యలపై అవగాహన కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ వెంకటేశులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

భ్రూణ హత్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆర్‌డిఒ వెంకటేశులు సూచించారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ ఆథారిటీ, సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ అడ్వైజర్ కమిటీ యాక్ట్‌పై సమావేశం నిర్వహించారు. సమావేశంలో లింగనిష్పత్తి, భ్రూణహత్యల నివారణకు స్కానింగ్ కేంద్రాలపై పూర్తిస్థాయి నిఘా ఉంచాలన్నారు. అవగాహనా సదస్సులు, కళాజాత ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. వైద్యుల సిఫారస్ లేకుండా గర్భస్రావం మాత్రలను ఇచ్చే దుకాణాలు, ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో అంగన్వాడీ, ఆశా, ఆరోగ్య కార్యకర్తలను కూడా భాగస్వామ్యం చేయాలన్నారు. ఇన్‌ఛార్జి డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి అరి ఫుల్లా, ప్రాంతీయ ఆసు పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ డేవిడ్ సెల్వరాజు, గైన కాలజిస్ట్ డాక్టర్ లక్ష్మిప్రియ, డాక్టర్ శుభశ్రీ, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు.హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య, సీనియర్ అసిస్టెంట్ నరేష్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న ప్రజలు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. మండలంలోని పలు గురాళ్లపల్లె సచివాలయ పరిధిలోని పలుగురాళ్లపల్లి, దళితవాడ, జవుకుపల్లి దళితవాడ, కొత్తపల్లి గ్రామాల్లో సోమవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటికెళ్లి సంక్షేమ పథకాల ద్వారా వారికందని లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్‌ను అందజేశారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో సిఎం జగన్ విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. వాలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన తీసుకొచ్చిన ఘనత సిఎం జగన్‌దే అన్నారు. ప్రజల్లో జగన్‌కు వస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేక టిడిపి, జనసేన విమర్శలు చేస్తున్నాయని తెలి పారు. కార్యక్రమంలో ఎంపిపి వీర నారాయణరెడ్డి, జడ్‌పిటిసి రామగోవింద్‌రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొ న్నారు.


బస్టాండ్ ఆవరణలో అనధికారికంగా ఉన్న దుకాణాలు

అనధికార దుకాణాలను తొలగిస్తాం : ఆర్‌టిసి డిఎం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల ఆర్‌టిసి బాస్టాండ్‌లో అనధికారికంగా ఉన్న దుకాణాలను తొలగిస్తామని ప్రొద్దుటూరు ఆర్‌టిసి డిపో మేనేజర్ మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. బస్టాండ్ ఆవరణలో అనధికారికంగా ఏర్పాటు చేస్తున్న దుకాణాలను సోమవారం డిఎం, మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్, మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎం మాట్లాడుతూ మాట్లాడుతూ దుకాణాలు ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు బస్సు ఎక్కుటకు, దిగుటకు ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రయాణికుల నుండి ఫిర్యాదులు అందడంతో వాటిని తొలగించే చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. పట్టణ పరిధిలో తిరిగే ఆటోలు తప్ప మిగిలిన ఆటోలు బస్టాండ్ పరిసరాల్లో నిలుపురాదని హెచ్చరించారు. బస్టాండ్ ఆవరణంలో ద్విచక్ర వాహనాలను ఎక్కడపడితే అక్కడ పార్కు చేసి వెళుతున్నారని, ఈ కారణంగా బస్సులకు తీవ్ర ఇబ్బందికరంగా మారిందన్నారు. పార్కింగ్ రుసుం వసూలుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్వో గంగిరెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్ పాల్గొన్నారు.

గుండెపోటుతో జువారి కార్మికుడి మృతి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండలంలోని జువారి సిమెంట్స్ కర్మాగారంలో సిరివెళ్ల సాంబశివుడు (38) అనే వ్యాగన్ లోడింగ్ కార్మికుడు సోమవారం సాయంత్రం విధులు నిర్వహిస్తుండగా గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. తోటి కార్మికులు హుటాహుటిన కర్మాగారంలోని ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతదేహాన్ని మళ్లీ కర్మాగారం వద్దకు తెచ్చి తమకు న్యాయం చేయాలంటూ సాంబశివుడి బంధువులు గేటు వద్ద బైఠాయించారు. కార్మికుడు శిఖ ఇన్‌ఫ్రా అనే కాంట్రాక్టు సంస్థలో పనిచేస్తున్నట్లు సమాచారం. ఈ సంస్థ స్థానిక ఎమ్మెల్యే బంధువులది కావడంతో న్యాయం చేస్తానని ఎమ్మెల్యే హామీ మేరకు.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.


పురస్కారం అందుకుంటున్న పెరుగు ఓబులేసు

పెరుగు ఓబులేసుకు పర్యావరణ మిత్ర పురస్కారం

ప్రజాశక్తి - చాపాడు

శ్రీ సత్య సాయి జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో హిందూపురంలో జరిగిన పురస్కార ప్రదానోత్సవంలో ఎన్‌డబ్ల్యుఎ రాష్ట్ర కార్యదర్శి పెరుగు ఓబులేసు (భవాని) పురస్కారం అందుకున్నారు. వచన, పద్య కవితల్లో పర్యావరణాన్ని రక్షించుకోకపోవడం, చెట్లు, అడవులను నిర్మూలించడం వల్ల, ప్లాస్టిక్ వినియోగం, విష రసాయనాలు విరివిగా వాడడం వల్ల జరిగే అనర్థాలను.. చెట్లను నాటి పోషించడం వలన కలిగే లాభాలను తెలుపుతూ కవితా గానం చేశారు. అనంతరం జాబిలి చాంద్ బాషా, స్వాతంత్ర సమర యోధులు మెళవాయి గోవిందరెడ్డి, పర్యావరణ వేత్తలు భాస్కర్‌రెడ్డి, భాస్కర్ నాయుడు ఓబులేసును పర్యావరణ మిత్ర పురస్కారంతో ఘనంగా సత్కరించారు. జాతీయస్థాయిలో వందమందికిపైగా కవులు పాల్గొన్నారు.


తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్న పర్యవేక్షకురాలు

తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యం

ప్రజాశక్తి - ఖాజీపేట

బిడ్డలకు తల్లిపాలు పట్టించడం వల్ల వారు ఆరోగ్యకరంగా ఉంటారని, తల్లిపాలలో వ్యాధి నిరోధకశక్తి ఎక్కువగా ఉంటుందని స్త్రీశిశు సంక్షేమ శాఖ పర్యవేక్షకురాలు జహీరాబీ తెలిపారు. మండలంలోని దుంపలగట్టు దళితవాడ అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డబ్బా పాలు పట్టించడం వల్ల పిల్లలు ఆరోగ్యకరంగా ఎదుగుదలకు నోచుకోరని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగనవాడీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ముర్రుపాలు టీకాతో సమానం

దువ్వూరు : మండల పరిధిలోని గుడిపాడు అంగన్వాడీ కేందర్ంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ సౌజన్య మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకి శ్రేష్టమన్నారు. అవి ఒక టీకాతో సమానమన్నారు. తల్లి పాలు తాపిస్తే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. మెదడు చురుగ్గా పనిచేస్తుందన్నారు. జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. తల్లిపాలు బిడ్డకు సహజమైన ఆహారమని వివరించారు. తల్లిపాలివ్వడం ద్వారా రొమ్ము క్యాన్సర్‌ను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.


దువ్వూరులో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది



వెంకట్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

వెంకట్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

వైకల్యం ఉన్నప్పటికీ ఆత్మ విశ్వాసంతో అంచెలంచెలుగా ఎదిగి రాష్ట్రపతి అవార్డు తీసుకున్న వెంకట్‌ను నేటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని దీప్తి కళాశాల ప్రిన్సిపల్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. దీప్తి జూనియర్ కళాశాలలో సోమవారం సాయంత్రం మోటివేషనల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంకట్ తన పాటలు, నృత్యం, లిప్‌రీడింగ్, డైలాగులతో విద్యార్థుల్ని అలరించారు. వెంకట్ తల్లి విశాలాక్షి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆత్మవిశ్వాసం, అంకితభావం, దృఢసంకల్పం, సమయ పాలనతో నిర్ణయించుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. నైతిక విలువలతో మెలగాలన్నారు. ప్రదర్శన అనంతరం వెంకట్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల వ్యవస్థాపకులు సునీల్‌బాబు, బాలసుబ్బారెడ్డి, అధ్యాపకులు అపర్ణ, మీనాకుమారి, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో తప్పులుండరాదు

ప్రజాశక్తి - రాయచోటి

ఓటర్ల జాబితాలో తప్పులుండరాదని, జాతీయస్థాయిలో జరగబోయే 'నా భూమి నా దేశం' కార్యక్రమానికి సిద్ధంగా ఉండాలని కలెక్టర్ గిరీష పిఎస్ అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితా, నా భూమి నా దేశం (మేరి మాటి మేర దేశ్), జగనన్న సురక్ష, గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో, హౌసింగ్ ఇ-కెవైసి తదితర అంశాలపై కలెక్టర్ పిఎస్‌ఆర్డిఓలు, మండల ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా అధికారులతో సోమవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీరో డోర్ నెంబర్ ఉన్న ఓట్లను పరిశీలించి సరిచేయాలన్నారు. ఒకే డోర్ నెంబర్‌తో 10 మంది కంటే ఎక్కువ ఉన్న ఓట్లను పరిశీలించి సరిచేయాలని అధికారులకు సూచించారు. వాలంటీర్లను ఉపయోగించుకోకూడదని అధికారులకు స్పష్టం చేశారు. గ్రోస్ ఎన్రోల్మెంటరీ రేషియో గురించి మాట్లాడుతూ 485 మంది వాలంటీర్లు 100 శాతం పూర్తి చేశారని, మిగిలిన వారు కూడా త్వరగా 100 శాతం పూర్తి చేసేలా మండల స్పెషల్ ఆఫీసుర్లు తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. జగనన్న సురక్ష పథకం పై సమీక్షిస్తూ పథకాలకు సంబంధించిన సమస్యలను వెల్ఫేర్ అసిస్టెంట్లు త్వరగా పరిష్కరించాలని, వాలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి సర్వే నిర్వహించాలని ఆదేశించారు.'నా భూమి, నా దేశం' గురించి సమీక్షిస్తూ ఈ నెల 14కల్లా ఇందులో భాగంగా ఉన్న 5 కార్యక్రమాలను (శిలాఫలకాలను ఏర్పాటు చేయడం, ప్రతిజ్ఞ చేయడం, మొక్కలు నాటడం, వీరులకు వందనం, జాతీయ జెండాను ఎగరవేయడం) అన్ని గ్రామ సచివాలయాలలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రతి రోజు ఏఏ గ్రామ సచివాలయాలలో ఈ 5 కార్యక్రమాలను నిర్వహించాబోతున్నారో తెలియజేస్తూ షెడ్యూల్‌ను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. గ్రామ సచివాలయాలలో ఈ 5 కార్యక్రమాలు పూర్తయిన తర్వాత నియోజకవర్గ స్థాయిలో కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.. సమీక్షలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా అధికారులు, పంచాయతీ సెక్రటరీలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

తగ్గుతున్న టమోటా ధరలు

బాక్సు రూ.4,300 నుంచి రూ.2,300కు తగ్గిన ధర - నాణ్యతను బట్టి కిలో రూ.65 నుంచి రూ.100

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రజలకు ఊరట కల్పించే మాట మార్కెట్లో వినపడుతోంది. గత నెల నుంచి టమోటా ధరలు ఠారెత్తిస్తోన్న సంగతి తెలిసిందే. అయితే సోమవారం నాటికి వాటి ధర సగానికి తగ్గుముఖం పట్టాయి. వ్యవసాయ మార్కెట్‌లో రెండు రోజులుగా టమోటా ధరలు తగ్గుతూ వస్తున్నాయి. నిన్నటి వరకు రూ.4,300 పలికిన 23 కిలోల బాక్సు ధర.. ఆదివారం అత్యధికంగా రూ.2,300కు చేరింది. నాణ్యతను బట్టి బాక్సు రూ.1,500 నుంచి రూ.2,300 వరకు పలికింది. నిన్నటి వరకు కిలో రూ.200కి చేరువైన ధర ప్రస్తుతం రూ.65 నుంచి రూ. 100కు చేరుకుంది. ధరలు ఇంకా కొన్ని రోజులు అధికంగా ఉంటాయనుకున్నా.. ధరలు ఒక్కసారిగా తగ్గుముఖం పట్టడంతో రైతులు, దళారుల్లో కొంత ఆందోళన ఉన్నా.. ప్రజలు కొంతమేర ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రొద్దుటూరులో ఆదివారం కిలో రూ.88 పలికింది. జమ్మలమడుగులో రూ.100. బయట రాష్ట్రాల్లో టమోటాల దిగుబడి రావడం, స్థానికంగా కూడా రైతులు టమోటా పంటను సాగు చేయడంతో దిగుబడి పెరిగింది. వారం రోజుల కిందట మార్కెట్ యార్డుకు 100 క్వింటాళ్లలోపు టమోటాలు రాగా. ప్రస్తుతం రోజు 300 కింటాళ్లకుపైగా వస్తున్నా యి. ఈ క్రమంలో మూడు రోజులుగా ధరలు తగ్గుముఖం పట్టాయి.



మార్కెట్లోకి వచ్చిన టమోటా బాక్సులు

'హక్కుల సాధనకు ఐక్యమవుదాం'



ర్యాలీగా వస్తున్న చేనేత నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

హక్కుల సాధనకు రాష్ట్రంలోని చేనేతలంతా ఐక్యం కావాలని, తద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయని మోరగుడి సర్పంచ్ కొండయ్య, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీరణాల శివనారాయణ, జాతీయ చేనేత ఐక్యవేదిక నాయకులు కాటా రామదాసు పిలుపునిచ్చారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సోమవారం చేనేత కార్మికులు వేపరాల గ్రామం నుంచి జమ్మలమడుగు కొండా రామయ్య విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కుండా రామయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో వ్యవసాయం తర్వాత పెద్ద పరిశ్రమ చేనేత రంగం అన్నారు. అంత పెద్ద పరిశ్రమపై దేశంలో కోట్ల మంది కార్మికులు జీవనాన్ని కొనసాగిస్తున్నారు. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల నేతన్నలు చితికిపోతున్నారన్నారు. కేంద్రం జిఎస్‌టి తెచ్చి చేనేత పరిశ్రమపై భారాలు మోపిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మైలవరంలో టెక్స్‌టైల్స్ పార్కు ఏర్పాటులో నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఒకటిన్నర సెంటు ఏమాత్రం సరిపోదన్నారు. ప్రత్యేక విభజన కింద చేనేత కార్మికులకు ప్రతి ఒక్కరికీ మూడు సెంట్లు స్థలం కేటాయించాలన్నారు. ఒక్కొకరికి ప్రభుత్వమే రూ.ఆరు లక్షల కేటాయించి ఇంటి నివాసం ఏర్పాటు కోసం సహకరించాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, బాలకృష్ణ, కొండయ్య, సంజీవ రాయుడు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లను అభివృద్ధి చేస్తున్నాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో రోడ్లను అన్నివిధాలా అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. ఎంఎల్ఏ ఎస్ రఘురామిరెడ్డి సూచించారు. నూతనంగా నిర్మించిన రామసుబ్బమ్మ కొట్టాలు-వెదురూరు రహదారిని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పూర్తి చేయని దెబ్బతిన్న రోడ్లను పూర్తిస్థాయిలో బాగు చేశామన్నారు. రాజకోటాలు రోడ్డు నుంచి ఖాజీపేట మండలం తవ్వారుపల్లె వరకు రూ.4.65 కోట్లతో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం ద్వారా కెసి కెనాల్ కాలువ వెంబడి ఉన్న గ్రామాలను కలుపుతూ రోడ్డు నిర్మాణాన్ని పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో పూర్తి చేశామన్నారు. ఈ మార్గంలో రాజకోట, విజయనగరం, ఓబుల్‌రెడ్డిపేట, గాంధీనగర్ గ్రామాలున్నాయన్నారు. వీటితోపాటు ఖాజీపేట మండల పరిధిలో శాంతినగర్, తుడుమలదిన్నె, తవ్వారుపల్లె గ్రామాలున్నాయన్నారు. చింతకుంట-చియ్యపాడు రహదారిని కూడా అభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ఎంపిపి లక్ష్మయ్య, వైసిపి మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, డిఈ మల్లేశ్వర్‌రెడ్డి, నాయకులు వినయ్‌కుమార్ రెడ్డి, రమణయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తోందని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర వ్యవసాయ ప్రభుత్వ సలహాదారులు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ఉద్యానశాఖ సలహాదారులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి మండలంలోని వెదురూరు గ్రామంలో రూ.21.80 లక్షలతో నూతనంగా నిర్మించిన ఆర్‌బికె భవనాన్ని, రూ.20.80 లక్షలతో నిర్మించిన హెల్త్‌క్లినిక్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హతగల ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. మినుములు పంపిణీ చేయాలని రైతులు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో ఎంపిపి లక్ష్మమయ్య, పిఆర్ డిఇ రామచంద్రారెడ్డి, ఎఇ ఈశ్వరయ్య, ఎఒ మ్యాగీ, వైసిపి మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, గృహసారధుల మండల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి, సివి సుబ్బారెడ్డి, జయ సుబ్బారెడ్డి, జయరామిరెడ్డి, సర్పంచ్ లలితమ్మ, ఎంపిటిసి శివ, గ్రామ నాయకులు చిన్న వీరారెడ్డి, యల్లారెడ్డి, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



నూతనంగా నిర్మించిన రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నేడు చక్రాయపేట మండల సమావేశం

చక్రాయపేట : చక్రాయపేట మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ శివారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో పలు అంశాలపై చర్చ స్తామన్నారు. అధికారులు తమ నివేదికలతో హాజరు కావాలన్నారు. ప్రజాప్రతినిధులు తమ గ్రామాల సమస్యలను సమావేశం దృష్టికి తేవాలని ఆయన కోరారు.

ఐదు వార్డులకు నోటిఫికేషన్ విడుదల

పుల్లంపేట :వివిధ గ్రామ పంచాయితీల్లో ఖాళీగా ఉన్న వార్డులకు సోమవారం నోటిఫికేషన్ వెలువడిందని ఎంపిడిఒ రఘురాం తెలిపారు. అప్పయ్యరాజుపేటలో ఐదో వార్డు, కోనయ్యగారి పల్లిలో ఆరవ వార్డు, పుత్తనవారిపల్లెలో ఒకటో వార్డు, రంగంపల్లిలో ఎనిమిదో వార్డు, వత్తలూరులో ఏడవ వారుకు ప్రకటన వచ్చిందన్నారు. నామినేషన్ 10వ తేదీ సాయంత్రం వరకు వేయవచ్చున్నారు. పోలింగ్ 19న ఉంటుందన్నారు.



గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిఐటియు నాయకులు

గద్దర్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ప్రముఖ ప్రజా గాయకుడు గద్దర్ మృతి చాలా బాధాకరమని సిఐటియు నాయకులు పేర్కొన్నారు. సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎన్‌జిఒ హోంలో గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కార్యదర్శి దాసరి విజయ్, ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఆదాం సంతాపం తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ గద్దర్ తన కళతో, ప్రజలను చైతన్య చేయడానికి కృషి చేశారన్నారు. జానపద కళారూపాలకు విప్లవ సాహిత్యాన్ని జోడించి, ప్రజా సంస్కృతికి పట్టం కట్టారని తెలిపారు. సామాజిక మార్పు కోసం, దోపిడీ రహిత సమాజం కోసం గద్దర్ తపన పడ్డారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు రాజు, అబ్రహం రవి, భాస్కర్‌రెడ్డి, దివాకర్ పాల్గొన్నారు.



విద్యార్థులతో ఎంఇఒ, ఉపాధ్యాయులు

సృజనాత్మకతను వెలికి తీసేందుకే క్రీడా పోటీలు : ఎంఇఒ

ప్రజాశక్తి - ఖాజీపేట

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకే క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ నాగస్వర్ణలత తెలిపారు. కడప నగరం ఇండోర్ స్టేడియంలో సోమవారం విభిన్నప్రతిభావంత విద్యార్థులకు జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రన్నింగ్ రేస్ జూనియర్స్ విభాగం లో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి సంజయ్ మొదటి బహుమతి, రెండవ బహుమతి భవిత పాఠశాలకు చెందిన విద్యార్థి సోయబ్, జూనియర్స్ బాలికల విభాగంలో దుంపలగట్టుకు చెందిన మహాలక్ష్మి మొదటి బహుమతి సాధించగా, సీనియర్స్ రన్నింగ్ విభాగంలో ఎన్.దుర్గాప్రసాద్, వి.దుర్గాప్రసాద్ దక్కించుకున్నారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద సోమవారం ఎంఇఒ విద్యార్థులను అభినందించారు.

భవిత కేంద్రంలో ఉచిత దంత వైద్య శిబిరం

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక భవిత కేంద్రంలో సోమవారం ఉచిత దంత వైద్య శిబిరం ఏర్పాటు చేసి విభిన్నప్రతిభావంతుల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ అన్వర్ ఆధ్వర్యంలో భవిత కేంద్రంలో ఉన్న 30 మంది పిల్లలకు, 20 మంది తల్లిదండ్రులకు దంత వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా దంత వైద్యులు అన్వర్ మాట్లాడుతూ భోజనం చేసిన తర్వాత నోటిలో నీటిని వేసి పుక్కిలించాలన్నారు. దంతాల్లో ఇరుక్కున్న వాటిని తీయడానికి పుల్లలను ఉపయోగించరాదని సూచించారు. చాక్లెట్లు తినడం వల్ల దంతాలు పుచ్చిపోతాయన్నారు. ఎక్కువగా పండ్లు తినాలని కోరారు. అనంతరం దంతాలపై బ్రెస్ వేసే విధానంపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం ఎంఇఒ స్టాలిన్ ఐజాక్ విద్యార్థులకు బ్రష్‌లు, పేస్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్టు డాక్టర్ ఆనంద్, ఐఇఆర్‌టి యశోద, సుజాత, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



టూత్ పేస్ట్ పంపిణీ చేస్తున్న ఎంఇఒ స్టాలిన్ ఐజాక్

ఘనంగా రవీంద్రనాథ్ టాగూర్ వర్ధంతి

ప్రజాశక్తి-వాల్మీకిపురం


రవీంద్రనాథ్ టాగూర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

భారతదేశానికి జాతీయగీతాన్ని అందించిన కవి రవీంద్రనాథ్ టాగూర్ అని, తను రచించిన గీతాంజలి కావ్యానికి నోబెల్ బహుమతి అందుకొన్నాడని జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు ప్రభుచరణ్ అన్నారు. సోమవారం రవీంద్రనాథ్ టాగూర్ వర్ధంతి సందర్భంగా స్థానిక పివిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రవీంద్రనాథ్ టాగూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. టాగూర్ జనగణమనను 1919లో మదనపల్లెలో ఆంగ్లములోకి మార్నింగ్ స్టార్ ఆఫ్ ఇండియా అనే పేరుతో తర్జుమా చేశారన్నారు. ఈ తర్జుమా నేటికీ మదనపల్లెలోని బిటి కళాశాలలో ఉందన్నారు. మొదటిసారిగా బహిరంగంగా జనగణమన గీతాన్ని ఆలపించింది కూడా బిటి కళాశాలలోనే అని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సావిత్రి, ఉపాధ్యాయులు అమరనాథ రెడ్డి, వసుమతి, నాగేశ్వర, శ్రీనివాస్ రెడ్డి, కల్పలత, భాస్కర్ నాయక్, మహబూబ్‌ఖాన్, విద్యార్థులు పాల్గొన్నారు.